చాగంటికి కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారం

- ప్రదానం చేసిన పూర్వ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ



- వివరాలు మెయిన్‌లో

సింహాచలం సిరి గల్లంతు!

భక్తులు ఇచ్చిన 111.38 గ్రాముల బంగారు ముత్యాలహారంలో మిగిలింది 36 గ్రాములే

అప్పన్న మ్యూజియంలోనూ అపచారం

- 10 బంగారు గొలుసు ముక్కలు మాయం
- బరువు 6.2 గ్రాములు
- లెక్కాపత్రం లేని నిర్వహణ... నిర్లక్ష్యం



సింహాచలంలో మాయమైంది ఈ వెంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన ముత్యాలహారమే...

ఉప ఆలయాల్లో ఆభరణాలకు ఆపద

- వెండి వస్తువులను పూజకు వాడతారు
- కానీ, వాటిని ఎక్కడా నమోదు చేయరు
- ఇలాంటివి 16 వెండి వస్తువులున్నట్టు గుర్తింపు
- వాటి బరువు 9.464 కిలోలు
- నివేదిక ఇచ్చి ఆరు నెలలైనా చర్యలు పూజ్యం..
- మళ్లీ మరో ఐదుగురితో కమిటీ నియామకం
- నాలుగు నెలలైనా విచారణ పేరుతో నాన్చుడు ధోరణి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం దేవస్థానంలోని ఆభరణాలకు ఆపద వచ్చింది. లెక్కాపత్రం లేని దేవస్థానం నిర్వహణ, నిర్లక్ష్యంపై ఆరు నెలల క్రితమే నివేదిక అమరావతికి చేరినా, ఇంతవరకూ చర్యలు లేవు.

దేవస్థానంలోని ఉప ఆలయాల్లో కొన్ని ఆభరణాలు లేవని తెలిసిందని, విచారణ జరిపించాలంటూ కడపకు చెందిన కొండోజు ప్రభాకార ఆచారి అనే భక్తుడు దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బయటపడింది. ఆయన ఫిర్యాదుపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కాకినాడ రీజనల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు (ఈయన చందనోత్సవం సమయంలో ఇన్‌చార్జి ఈఓ)ను విజయవాడ అధికారులు ఆదేశించారు. ఆయన అసిస్టెంట్ కమిషనర్ హోదా కలిగిన పల్లంరాజును జ్యువెలరీ వెరిఫికేషన్

రిజిస్టర్‌లో నమోదు చేయని వెండి వస్తువులివీ..

- వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 248 గ్రాముల వెండి పళ్లెం
- గ్రామదేవత పైడితల్లమ్మ ఆలయంలో 329 గ్రాముల అరిటాకు పళ్లెం
- బంగారమ్మ ఆలయంలో 16 గ్రాముల బరువున్న రెండు సూత్రాలు
- భైరవస్వామి ఆలయంలో 208 గ్రాముల అర్థ కిరీటాలు రెండు, 1.15 కిలోల బరువుగల రాళ్ల కవచం
- మాధవధార వేణుగోపాలస్వామి ఆలయంలో 89 గ్రాముల పంచపాత్ర, ఉద్ధరిణి
- మాధవధార మల్లికార్జునస్వామి సన్నిధిలో 552 గ్రాముల అష్టలక్ష్మీ బిందె, 640 గ్రాముల బకెట్, చెంబు, చెంచా, 790 గ్రాముల ధార పాత్ర, 2,820 గ్రాముల పానుమట్టం, 218 గ్రాముల నాగాభరణం
- సింహగిరిపై కాశీవిశ్వేశ్వర పంచాయతన ఆలయంలో 835 గ్రాముల ధార పాత్ర, 260 గ్రాముల శఠారి, 955 గ్రాముల పళ్లెం
- గంగధార సమీపాన ఉన్న సీతారామస్వామి దేవాలయంలో 78 గ్రాముల కిరీటం, తదితర వస్తువులు...

ఆఫీసర్ (జేవీఓ)గా సింహాచలం పంపించారు. ఆయన అనేకసార్లు ఆలయ అధికారులు, పూజార్లతో మంతనాలు జరిపి ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో సింహాచలం వచ్చి ఆభరణాలు తనిఖీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న అమరావతిలో నివేదిక సమర్పించారు. అందులో అనేక లోపాలు ప్రస్తావించినట్టు తెలిసింది. కొన్ని బంగారు ... మిగతా 6వ పేజీలో

మహా మాయగాళ్లు

గాజువాక ఆశీలు కాంట్రాక్టర్‌తో జోనల్ అధికారుల కుమ్మక్కు

- రూ.2.2 కోట్లకు వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్
- స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందడంలో మూడు నెలలు జాప్యం
- ఆ మూడు నెలలు వసూలు చేసుకున్నది అతనే...
- ఏడాది కాలానికి కాంట్రాక్టర్ నుంచి మొత్తం వసూలుచేయాలని కమిటీ తీర్మానం
- అయినా తొమ్మిది నెలలకే టెండరు ఇచ్చిన అధికారులు
- రూ.లక్షలు చేతులు మారినట్టు ఆరోపణలు



గాజువాక మార్కెట్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గాజువాక మార్కెట్ ఆశీలు వసూలు టెండర్ కేటాయింపులో జీవీఎంసీ రెవెన్యూ అధికారులు భారీ గోల్‌మాల్‌కు పాల్పడ్డారు. కాంట్రాక్టర్‌కు మేలు చేసేందుకు స్టాండింగ్ కమిటీ ఆదేశాలను సైతం బేఖాతరు చేశారు. కాంట్రాక్టర్ నుంచి ఏడాది కాలానికి పూర్తిమొత్తాన్ని వసూలు చేయాలని కమిటీ తీర్మానం చేస్తే...అలాగేనని తలూపిన అధికారులు కేవలం తొమ్మిది నెలలకు చెల్లిస్తే సరిపోతుందని మాటమార్చారు. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలోని మార్కెట్లు, రోడ్డు మార్జిన్లలో దుకాణాలు, గూడ్స్‌వాహనాల నుంచి ఆశీలు వసూలుకు జీవీఎంసీ ఏటా బహిరంగవేలం నిర్వహిస్తుంది. వేలంలో ఎవరు ఎక్కువకు పాడతారో వారికి ఆశీలు వసూలు చేసేందుకు ఏడాదిపాటు అనుమతిస్తారు. సాధారణంగా ఏటా ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు (ఆర్థిక సంవత్సరం) వరకు ఆశీలు వసూలుకు వేలం పాట నిర్వహిస్తుంటారు. అదేమాదిరిగా గాజువాక మార్కెట్‌లో ఆశీలు వసూలుకు జోన్-6 (గాజువాక)రెవెన్యూ అధికారులు ఈ ఏడాది మార్చిలో వేలం నిర్వహించారు. ఒకరు రూ.2.2 కోట్లు (జీఎస్టీతో కలిపి) చెల్లించేందుకు సిద్ధం కావడంతో ఆయనకు ఖరారు చేయాలని అధికారులు నిర్ణయించారు. వేలంలో అధిక మొత్తానికి పాడిన వారితో తర్వాత స్థానంలో ఉన్న ఇద్దరి వివరాలతో ఫైల్ తయారుచేసి స్టాండింగ్ కమిటీ అనుమతికి పంపిస్తారు. స్టాండింగ్ కమిటీ అనుమతి లభించిన తర్వాత కాంట్రాక్టర్‌కు వర్క్ ఆర్డర్ అందజేస్తే ఏప్రిల్ ఒకటి నుంచి ఆశీలు వసూలు ప్రారంభిస్తారు. అయితే ఈ ఏడాది మార్చిలో మేయర్‌పై అవిశ్వాసం, కొత్త మేయర్ ఎన్నిక, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వంటివి వరుసగా రావడంతో స్టాండింగ్ కమిటీ సమావేశం జూన్ వరకూ జరగలేదు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఆశీలు వసూలు బాధ్యతను సంబంధిత జోన్‌ల రెవెన్యూ సిబ్బందే (డిపార్టుమెంట్ కలెక్షన్) చేయాల్సి ఉంటుంది. ఆశీలు రూపంలో వసూలైన మొత్తాన్ని ఏరోజుకారోజు జీవీఎంసీ సౌకర్యం కేంద్రానికి వెళ్లి జీవీఎంసీ ఖాతాకు జమ చేయాలి. అయితే సిబ్బంది కొరత కారణంగా గాజువాక, పూర్ణామార్కెట్‌లలో ఆశీలు వసూలును వేలంలో ఎక్కువ మొత్తానికి పాడిన కాంట్రాక్టర్లే చేసుకునేందుకు ఆయా జోన్‌ల అధికారులు అనధికారికంగా అనుమతి ఇచ్చేశారు. దీంతో వారే ఏప్రిల్ ఒకటి నుంచి ఆశీలు వసూలుచేసుకుంటున్నారు. కొత్తమేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావు ... మిగతా 6వ పేజీలో

ప్రాణం తీసిన అతివేగం

- ఇటుకల లోడు వ్యాన్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- ఇద్దరు యువకులు దుర్మరణం
- బీఆర్‌టీఎస్ రోడ్డులో ప్రమాదం

ఆరిలోవ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అతి వేగం రెండు నిండు ప్రాణాలను బలిగొంది. బీఆర్‌టీఎస్ రోడ్డులో మంగళవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు...కేంద్ర కారాగారం సమీపంలోని రామకృష్ణాపురానికి చెందిన గుడ్ల గోవిందరెడ్డి (32), హరీశ్ (25) ద్విచక్ర వాహనంపై హనుమంతువాక కూడలి నుంచి రాంగ్ రూట్‌లో వేగంగా వస్తున్నారు. సరిగ్గా వారు ముడసర్లోవ వద్దకు చేరుకునే సరికి ఎదురుగా ఇటుకల లోడుతో వస్తున్న వ్యాన్‌ను బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దూరంగా తుళ్లి



గుడ్ల గోవింద రెడ్డి(ఫైల్)

పడిపోయిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. యువకులు ప్రయాణిస్తున్న ద్విచక్ర



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్

వాహనం నుజ్జునుజ్జయింది. ఘటనా స్థలాన్ని ట్రాఫిక్ ఏడీసీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. రాంగ్‌రూట్‌లో రావడమే ప్రమాదానికి కారణమన్నారు.

ముసురు



విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తాపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నగరంలో ముసురు వాతావరణం నెలకొంది. రెండు రోజుల నుంచి దఫదఫాలుగా ఒక మోస్తరు వర్షం కురుస్తోంది. మంగళవారం ఉదయం నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, ఇసుకతోట, డాబాగార్డెన్స్, మధురవాడ, వన్‌టౌన్ తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా నీరు చేరింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. బుధవారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

బాలికపై లైంగిక దాడి దురదృష్టకరం

- దోషులకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటాం
- బాధితురాలికి ప్రభుత్వపరంగా అవసరమైన సహకారం అందిస్తాం
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

మహారాణిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడి జరగడం దురదృష్టకరమని, దోషులకు కఠినశిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. ఈ నెల ఏడో తేదీన పదకొండేళ్ల బాలికపై ఇద్దరు బాలురు అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. కేజీహెచ్ ఆవరణలోని వన్‌స్టాప్ సఖి సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధిత బాలికను ఆమె మంగళవారం ... మిగతా 6వ పేజీలో

పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు నోటీసులు

- డిపాజిట్ సొమ్ము జీవీఎంసీకి జమ చేయండి
- జోన్-4 సమీక్షలో కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశం
- తాగునీటి సరఫరాలో ఇబ్బంది రాకూడదు
- ఆస్తిపన్ను చెల్లించని వారి ఆస్తులను జప్తు చేయండి

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు ప్రారంభించడంలో జాప్యం చేయడంపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అసంతృప్తి వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన సూర్యాబాగ్‌లోని జోన్-4 కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనులతోపాటు పెండింగ్‌లో ఉన్న పనుల గురించి ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు. మంజూరైన పనులను సంబంధిత కాంట్రాక్టర్ నిర్ణీత సమయంలో ప్రారంభించి సకాలంలో పూర్తి చేసి జీవీఎంసీకి అప్పగించాలన్నారు. వర్క్ ఆర్డర్ తీసుకున్న తర్వాత కూడా పనులు ప్రారంభించకుంటే కాంట్రాక్టర్లకు నోటీసులు జారీచేయడంతోపాటు వారి డిపాజిట్ సొమ్మును జీవీఎంసీకి జమ చేయాలని అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్లు పనులు చేయడంలో నిర్లక్ష్యం వహించకుండా చూడాల్సిన బాధ్యత ఇంజనీర్లదేనని స్పష్టంచేశారు.

ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి జాప్యం, ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత విభాగం అధికారులను ఆదేశించారు. వర్షాకాలం కావడంతో మురుగు కాలువలు, డ్రైనేజీల్లో నీటిసరఫరా పైప్‌లైన్‌లు ఉంటే వాటికి లీకులు లేకుండా జాగ్రత్తవహించాలన్నారు. ఏమాత్రం పైప్‌లైన్ లీకేజీ ఉన్నా



సూర్యాబాగ్‌లోని జోన్-4 కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

నీటి కాలుష్యం జరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పువాటిల్లుతుందన్నారు. విద్యుత్ దీపాల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలన్నారు. అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. జోన్ పరిధిలో అనధికార నిర్మాణాలపై ఇప్పటివరకూ తీసుకున్న చర్యలపై కమిషనర్ ఆరా ... మిగతా 6వ పేజీలో

ఖాళీగా కూర్చోబెట్టి జీతాలు!

- స్టీల్‌ప్లాంటులో విడ్డూరం
- పనులు లేకుండా కొనసాగుతున్న 'ప్రాజెక్ట్సు' విభాగం
- నాలుగు సెక్షన్లు... 40 మంది అధికారులు



స్టీల్ ప్లాంటులో ప్రాజెక్ట్ కార్యాలయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్ ప్లాంటు యాజమాన్యం కొందరిపై ప్రత్యేక ప్రేమ చూపిస్తోంది. వ్యయ నియంత్రణ పేరిట ఇటీవల వేలాది మందిని బయటకు పంపించిన యాజమాన్యం ప్లాంటులో ఎటువంటి పనులు లేని ప్రాజెక్ట్సు విభాగాన్ని ఎందుకు కొనసాగిస్తోందని మిగిలిన విభాగాల ఎగ్జిక్యూటివ్‌లు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఇటీవల జరిగిన సమావేశంలో నేరుగా యాజమాన్య ప్రతినిధులనే నిలదీశారు.

స్టీల్ ప్లాంటు విస్తరణ ఎప్పుడో పూర్తయ్యింది. ప్రస్తుతం ఎటువంటి కొత్త ప్రాజెక్టులు లేవు. అటువంటప్పుడు ఆ విభాగానికి ప్రత్యేక కార్యాలయం, దానికి ఒక డైరెక్టర్, అందులో మరో నాలుగు సెక్షన్లు, వాటిలో 44 మంది అధికారులు దేనికనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కార్పొరేట్, కనస్ట్రక్షన్, ప్రాజెక్ట్స్, పర్యవేక్షణ విభాగాలు ఉన్నాయి. వాటికి జనరల్ మేనేజర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు, మేనేజర్లు ఇలా వివిధ హోదాలతో పనిచేస్తున్నారు.

రాయబరేలిలో రైళ్లకు అవసరమైన చక్రాలను తయారుచేసే పరిశ్రమను ఏర్పాటుచేశారు. అక్కడకు కొంత మందిని డిప్యూటేషన్‌పై పంపించారు. ఆ సంస్థను రైల్వేకి ఇచ్చేయడంతో స్టీల్ అధికారులను తిరిగి వెనక్కి తీసుకువచ్చారు. వారిలో నలుగురు ప్రాజెక్ట్స్‌కు సంబంధించిన వారు ఉన్నారు. ప్రస్తుత యాజమాన్యం వారికి ఎటువంటి పనులు అప్పగించకుండా ఖాళీగా కూర్చోబెట్టి జీతాలు చెల్లిస్తోంది. వారు మాత్రం యాజమాన్యం తమను అవమానిస్తోందని, బాధ్యతలు ఇవ్వకుండా ఖాళీగా ఉంచడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడైనా ప్రాజెక్ట్స్ వింగ్ ఎంతవరకు అవసరమో పునఃపరిశీలన చేసి, అవసరం లేని వారిని వేరే విభాగాలకు సర్దుబాటు చేయాలని, అందరికీ బాధ్యతలు అప్పగించేలా చూడాలని ఉక్కు ఎగ్జిక్యూటివ్‌లు డిమాండ్ చేస్తున్నారు.

మరో 175 బస్సులు అవసరం

- ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి ఆర్ఎం లేఖ

ద్వారకా బస్‌స్టేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం అమలు తరువాత విశాఖ రీజియన్‌లో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుందని, ప్రస్తుత డిమాండ్‌కు అనుగుణంగా చూస్తే మరో 175 బస్సులు అవసరమవుతాయని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మంగళవారం ప్రధాన కార్యాలయానికి లేఖ రాశారు. స్త్రీశక్తి పథకం వర్తిస్తున్న ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు ప్రస్తుతం విశాఖ రీజియన్‌లో 570 ఉన్నాయి. వీటిలో ప్రతిరోజూ 2.2 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. మరో 60 వేల మంది పురుషులు టికెట్లు తీసుకుని ఇవే బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. మొత్తం 570 బస్సుల్లో ప్రతిరోజూ 2.8 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. దీంతో బస్సులన్నీ విపరీతమైన రద్దీగా మారుతున్నాయి. అందువల్ల విశాఖకు 175 బస్సులు తక్షణమే ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి పంపిన లేఖలో ఆర్ఎం కోరారు.



కాపర్ ప్లేట్లను కరిగించి చిన్నపాటి దిమ్మెలుగా మార్చిన దృశ్యం

కాపర్ ప్లేట్లను కరిగించేశారు

- 6లో

- స్టీల్‌ప్లాంటులో దొంగిలించిన నాలుగింటిని 41 దిమ్మలుగా మార్చిన దొంగలు
- చోరీ సొత్తు స్వాధీనం, ముగ్గురి అరెస్టు



భూసార పరిరక్షణ గురించి వివరిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ విజయప్రసాద్

పంటలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

భీమునిపట్నం (రూరల్) సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ మండలం లక్ష్మీపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం వ్యవసాయ పంటలు భూసార పరిరక్షణ గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం దంతంశెట్టి సత్యారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏ పంటలు ఎప్పుడు వేయాలి, ఎటువంటి ఎరువులు వాడాలి, స్థూల పోషకాలు అంటే ఏమిటి, మట్టి నమూనాలను ఎందుకు సేకరిస్తారు, వాటి భూసారాన్ని ఏ విధంగా తెలుసుకుంటారు? అనే విషయాలను వక్తలు విద్యార్థులకు వివరించారు. యూరియా, డీఏపీ వంటి ఎరువులు ఎప్పుడు వేయాలన్న విషయాలను అధికారులు తెలియజేశారు. విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారైనప్పటికీ చాలా విషయాలు వారికి తెలియవని, అందువల్ల వారి అవగాహన కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు తమ సందేహాలను వ్యవసాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ డైరెక్టర్ పి.విజయప్రసాద్, భూసార పరిరక్షణ ప్రయోగశాల సహాయ డైరెక్టర్ టి.దాస్, ఈ విభాగ సహాయ డైరెక్టర్ పి.హరికృష్ణ, మండల వ్యవసాయశాఖ అధికారులు నాయక్, నీలవేణి, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, సాయిలక్ష్మి, కేఆర్ఎస్ పట్నాయక్ తదితరులు మాట్లాడారు.

మహిళా సంఘాలకు యాప్‌పై శిక్షణ

ఆనందపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం 'మన డబ్బులు - మన లెక్కలు' యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొని తమ లెక్కల నిర్వహణపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా డీఆర్డీఏ డీపీఎం వైదేహి మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా ప్రతి సంఘం తమ పొదుపులు, అప్పులు, రుణాల తదితర లావాదేవీలు సులభంగా నమోదు చేసుకోవచ్చన్నారు. అంతేకాకుండా రియల్ టైమ్ రికార్డులు పొందగలుగుతారని, దీనివల్ల పారదర్శకత పెరిగి సభ్యులను భవిష్యత్తులో రుణ సదుపాయాలు పొందేందుకు సులభతరం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం కె.ఎస్తేరు రాణి, సీసీలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మహిళల వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్ టికెట్లు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐసీసీ మహిళల వరల్డ్ కప్ టోర్నీలో భాగంగా ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా అక్టోబరు 9 నుంచి జరగనున్న ఐదు మ్యాచ్‌లకు టికెట్ల అమ్మకాలు ఆన్‌లైన్‌లో మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. 'బుక్ మై షో'లో టికెట్ల అమ్మకాలు చేపట్టారు. స్టేడియంలోని జీ, ఎఫ్, డి, సి, కే, ఎం1 స్టాండ్స్‌కు సంబంధించి టికెట్లను విడుదల చేశారు. తొలిరోజు కేవలం 150 టికెట్లను మాత్రమే అందుబాటులో ఉంచారు. విశాఖలో అక్టోబరు 9నభారత్-దక్షిణాఫ్రికా, అక్టోబరు 12న భారత్-ఆస్ట్రేలియా, అక్టోబరు 13న దక్షిణాఫ్రికా-బంగ్లాదేశ్, అక్టోబరు 16న ఆస్ట్రేలియా-బంగ్లాదేశ్, అక్టోబరు 26న ఇంగ్లండ్-న్యూజిలాండ్ మధ్య జరగనున్న మ్యాచ్‌లకు టికెట్ల అమ్మకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం టికెట్ ధరను రూ.100లుగా నిర్ణయించి ఆన్‌లైన్‌లో ఉంచారు.

అప్పన్నను దర్శించుకున్న నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్

సింహాచలం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామిని కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సిబ్బంది స్వాగతం పలికింది. ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానున్న 'కిష్కింధపురి' చిత్రం ఘన విజయం సాధించాలని కప్పస్తంభం వద్ద పూజలు చేశారు. అనంతరం స్వామి వారి వద్ద కథానాయకుడికి గోత్రనామాలతో పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు ఆశీర్వచనాలను, ప్రసాదాలను అందజేశారు.



దర్శనం అనంతరం బయటకు వస్తున్న హీరో బెల్లంకొండ సాయి

నాగోతి సూర్యప్రకాశరావుకు పలువురి అభినందనలు

మధురవాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరక్టర్‌గా నియమితులైన నాగోతి సూర్యప్రకాశరావును మంగళవారం పలువురు నాయకులు అభినందించారు. సూర్యప్రకాశరావును అభినందించిన వారిలో 7వ వార్డు కారొపరేటర్ పిల్లా మంగమ్మ, మధురవాడ పీఏసీఎస్ చైర్‌పర్సన్ పోతిన ప్రసాద్, వార్డు టీడీపీ అధ్యక్షుడు పిల్లా నరసింగరావు, టీడీపీ నాయకులు వాండ్రాసి అప్పలరాజు, పోతిన నాయుడు, పిల్లా రాము, సుమన్ వెంకటరావు, పోతిన బుజ్జి, పిల్లా మోహన్ కృష్ణ ఉన్నారు.



సూర్యప్రకాశరావును సత్కరించిన కార్పొరేటర్ మంగమ్మ

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం



స్వామివారికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సింహాచలం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పదిరోజుల విరామం తరువాత వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత సేవలు మంగళవారం నుంచి పునఃప్రారంభించారు. ఆగస్టు 29న అంకురార్పణతో శ్రీకారం చుట్టిన పవిత్రోత్సవాల కారణంగా అప్పన్న సనిధిలో ఆర్జిత సేవలు నిలిపివేశారు. తరువాత చంద్రగ్రహణంతో మరొక రెండు రోజులు సేవలు జరగలేదు. మంగళవారం వేకువజామున సుప్రభాత సేవతో తిరిగి ఆర్జితసేవలను ప్రారంభించారు. వాటిలో భాగంగా ప్రభాతారాధనలు యథావిధిగా చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో స్వామి, దేవేరులకు కల్యాణం చేయించుకున్న భక్తులకు కంకణధారణలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.త

బస్సు షెల్టర్ల తొలగింపుతో విద్యార్థుల ఇక్కట్లు

» రుషికొండ ప్యాలెస్‌కు అడ్డు నెపంతో గత ప్రభుత్వ హయాంలో తొలగించిన అధికారులు



బస్సుషెల్టర్ లేక ఎండలోనే డివైడర్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గాయత్రీ విద్యాపరిషత్ రుషికొండ వద్ద బస్సు షెల్టర్‌ను గత ప్రభుత్వ హయాంలో తొలగించారు. రుషికొండ ప్యాలెస్‌కు వెళ్లే దారికి అడ్డువస్తోందనే నెపంతో విద్యార్థులకు ఉపయోగపడే ఈ బస్సుషెల్టర్‌ను తొలగించారు. గతంలో ఆ చర్యను అంతా వ్యతిరేకించినప్పటికీ వారి రోదన వినలేదు. అప్పటి నుంచి ఇక్కడ నుంచి రాకపోకలు సాగించే విద్యార్థులు ఎండకు ఎండుతూ.. వర్షానికి తడుస్తూ కళాశాలకు రాకపోకలు సాగిస్తున్నారు.ఈ ప్రాంతం వద్ద వాహనాలు వేగం ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు ఆందోళన గురవుతున్నారు.

అలాగే గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎదురుగా వుడా హయాంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్సుషెల్టర్‌ను తొలగించారు. దీంతో అక్కడా విద్యార్థులు ఇబ్బందికి గురవుతున్నారు. రోడ్డు మీదే ఎండ, వానలను భరిస్తూ బస్సులు కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ రెండు ప్రాంతాలు వద్ద బస్సు షెల్టర్లను నిర్మించడంలో విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనానికి యూపీ రైతులు

» తర్లువాడలోని వ్యవసాయ క్షేత్రాల సందర్శన

ఆనందపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తర్లువాడలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ మోడల్స్‌ను పరిశీలించేందుకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన రైతులు, నేషనల్ రిసోర్సెస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పి.తరుణ్ ఆదిత్య, శ్రీనులు మంగళవారం ఈ గ్రామాన్ని సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా కాంపాక్ట్ బ్లాక్‌లో సాగు చేస్తున్న వివిధ పద్ధతులను పరిశీలించారు. మోడల్ మేకర్ రామారావు ఏ-గ్రేడ్ మోడల్‌లో వేర్వేరు పంటలు, వాటి ద్వారా లభించే ఆదాయం గురించి వివరించారు. అనంతరం కర్రి రాంబాబు పొలంలో అమలు చేస్తున్నపీఎండీఎస్, లైవ్ మల్చింగ్ పద్ధతులను రైతులకు వివరించారు. తరువాత ఎస్ఎఫ్ఏ-హెచ్ఆర్ బి.శ్రీనివాస చక్రవర్తి పొలంలో సాగు చేస్తున్న ఏటీఎం మోడల్‌ను పరిశీలించిన రైతులు ఈ విధానంలో ఎదురయ్యే సమస్యలు, లాభాలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా ఏటీఎం మోడల్ ద్వారా 365 రోజుల పాటు పటు పంటల సాగు చేయడం వల్ల నిరంతరం ఆదాయం వస్తుందని, పురుగులు, తెగుళ్ల బెడద తగ్గుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి తర్లువాడ యూనిట్ ఇన్‌చార్జ్ రెల్లి పైడిరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు హాజరయ్యారు.

19న రణభేరి బైక్ జాతా

» యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్

పద్మనాభం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారంపై ఈ నెల 19న విశాఖపట్నం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రణభేరి బైక్ జాతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పద్మనాభం వచ్చిన ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు మన పోరాటాన్ని కొనసాగించాలన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 25న ఛలో విజయవాడ నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా మద్ది, రెడ్డిపల్లి, పొట్నూరు, బీఆర్ తాళ్లవలస జడ్పీ పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదుతో పాటు రణభేరి కార్యక్రమం గురించి వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎంవీఎస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజయ్‌బాబు, సీనియర్ నాయకులు సన్యాసినారవు, చిన్నారావు, వెంకటేష్, శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతుడి ఆలయానికి ఆర్వో వాటర్ ఫిల్టర్ వితరణ

పద్మనాభం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని గిరిపై ఉన్న అనంతపద్మనాభుడి ఆలయానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చడానికి ఒక దాత మంగళవారం ఆర్వో వాటర్ ఫిల్టరును వితరణ చేశారు. మద్ది డీఎస్‌బీ బ్యాంకు మేనేజర్‌గా పని చేస్తున్న జయకృష్ణ ఈ ఆర్వో ఫిల్టర్‌ను అందజేశారు. దీన్ని ఆలయ సిబ్బంది ఆలయంలో అమర్చారు. కాగా, ఘాట్ రోడ్డు పూర్తి కావడంతో ఇటీవల ఆలయానికి వచ్చే భక్తుల తాకిడి పెరిగింది.

కళా ఉత్సవ్ పోటీల వివరాలు

భీమునిపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కళా ఉత్సవ్ 2025లో నిర్వహించే పోటీల వివరాలను భీమిలి ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. కాగా, ఈ నెల 11న ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, నృత్యం, గాత్రం పోటీలు సోలో, గ్రూపు రెండు విధాలుగా జరుగుతాయని తెలిపారు. ఈనెల 12న ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్ (2డి, 3డి)లలో ఉంటాయన్నారు. ఈ నెల ఉదయం పది గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, 12వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరుగుతాయన్నారు. ఈ విషయాలను కళా ఉత్సవ్‌లో పాల్గొనే పాఠశాలలు, కళాశాలలు గుర్తించి హాజరు కావాలని ఆయన కోరారు.

ముగిసిన పౌష్టికాహార వారోత్సవాలు

ఎండాడ/ సాగర్‌నగర్ సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పౌష్టికాహార వారోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. వారోత్సవాల్లో భాగంగా నగరంలో ఉన్న పలు పాఠశాలల్లో గీతం ఫార్మసీ విద్యార్థులు పోషకవిలువలున్న ఆహార పదార్థాలను, పండ్లను పంపిణీ చేశారు. పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించి, విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో అధిక శాతం పౌష్టికాహార లోపం కారణంగా పలు వ్యాధుల భారిన పడుతున్నారని, పట్టణ ప్రాంతాల్లో ఊబకాయం, మధుమేహం వంటివి పెరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సౌజన్య, జీవీరాధ, ఎస్.స్వర్ణలత, ఆర్బీ నలంద, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

రోడ్లపై పరిశుభ్రత పాటించాలి:కేతన్‌గార్గ్



టీ దుకాణం వద్ద వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్



అధికారులకు సూచనలు చేస్తున్న జీవీఎంసీ కమిషనర్

సాగర్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రోడ్లు, జంక్షన్ల దగ్గర పరిశుభ్రత పాటించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. త్వరలో జరగనున్న ప్రధాన సమ్మిట్లు, ఐఎఫ్ఆర్ కార్యక్రమాలకు నగరం వేదిక కానుందని ఆయన తెలిపారు. ఈసందర్భంగా నగరంలోని ముఖ్య జంక్షన్లు, గ్రీన్ బెల్టులను పచ్చదనంతో సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. 8వ వార్డులోని రుషికొండ, టీటీడీ దేవాలయం వరకు ఉన్న రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఏపీజీబీసీ - ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ నాగేంద్ర, జీవీఎంసీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదర్‌రావు, ఆర్కిటెక్ట్ సత్యతో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుషికొండ నుంచి ఏ1 గ్రౌండ్ వరకు అలాగే టీటీడీ దేవస్థానం మొదలైన చోట్ల ఉన్న ప్రధాన రహదారిని కమిషనర్ పరిశీలించారు. కనీసం రెండురోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు వారంలోపు నివేదికను సమర్పించాలని అధికారులకు కేతన్‌గార్గ్ ఆదేశించారు. రుషికొండ జంక్షన్ బీచ్‌రోడ్డులో ఉన్న టీటైమ్ దగ్గర పడిఉన్న వ్యర్థాలను గమనించి, నిర్వాహకుల చేత శుభ్రం చేయించారు. వార్డు శానిటరీ సెక్రటరీ నిత్యం వార్డులో పర్యటిస్తూ, ప్రతిరోజు ఉదయాన్నే పారిశుధ్యకార్మికుల హాజరు నమోదు తప్పని సరిగా తీసుకోవాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. పర్యటనలో ఏఎంవోహెచ్ డాక్టర్ ఎన్.కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, తదితర అధికారులు పాల్గొన్నారు

ఉద్యోగి కుటుంబానికి బీమా పరిహారం



బాధితులకు చెక్కు అందచేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు

సీతమ్మధార, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్‌పీఎఫ్) మధ్య ప్రత్యేక శాలరీ ప్యాకేజ్ ఒప్పందంలో భాగంగా సహజ మరణం సంభవించిన ఓ వ్యక్తి కుటుంబానికి రూ.15 లక్షల బీమా చెల్లించారు. ద్వారకానగర్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ ఖాతాదారు ఏపీఎస్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ కొణతల పరమేశ్వరరావు దురదృష్టవశాత్తు 2025 మే 31న అనారోగ్యంతో మరణించారు. 2024 మే 22న కుదిరిన ఒప్పందం ప్రకారం బ్యాంక్ వెంటనే బీమా మొత్తంరూ.15 లక్షల చెక్కును మరణించిన వ్యక్తి భార్య కొణతల అన్నపూర్ణకు అందజేసింది. ఈ చెక్కును ఏపీఎస్‌పీఎఫ్ విశాఖపట్నం యూనిట్ ఇన్‌స్పెక్టర్ జి.మహేష్, ఆయన బృందం, బ్యాంక్ ఆఫ్ బరోడా విశాఖపట్నం రీజినల్ హెడ్ అండ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ లీనా గొహైన్, రీజినల్ ఆఫీస్ సిబ్బంది సమక్షంలో అందచేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాల ఆర్థిక భద్రతకు బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాధాన్యం ఇస్తుందనడానికి ఇది ఉదాహరణ అని పేర్కొన్నారు.

బారికేడ్‌తో తప్పని తిప్పలు

సింహాచలం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయ రాజగోపురానికి ఎదురుగా ఉన్న మాడవీధిలో ఇనుప బారికేడ్ పెట్టడం వల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నారు. రెండు నెలల క్రితం రాజగోపురం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో బారికేడ్‌ను ఏర్పాటు చేశారు. ప్రసాదాల విక్రయ కేంద్రాలకు, కాశీవిశ్వేశ్వర పంచాయతన ఆలయానికి మార్గం మూత పడింది. దీంతో ప్రసాదాలు కొనుగోలు చేసేందుకు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో పలువురు భక్తులు బారికేడ్‌పై నుంచి దూకి మరీ వెళుతున్నారు.

15న అప్పన్న సన్నిధిలో శ్రీకృష్ణ జయంతి

సింహాచలం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):'సింహమాసే రోహిణ్యాం అష్టమీ తిథౌ' అనే శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి శ్రీకృష్ణ జయంతి ఉత్సవాన్ని 15న వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్నట్టు కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాన్ని పురస్కరించుకుని 15 మధ్యాహ్నం 1:30 గంటలకు జరగాల్సిన రాజభోగ మహా నివేదన రాత్రి ఉత్సవం తరువాత జరగనున్నదని తెలిపారు. ఆరోజు సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయని తెలిపారు. 16న రాజగోపురం వద్ద సాయంత్రం 4:30 గంటలకు ఉట్ల సంబరం నిర్వహించనున్నారని తెలిపారు.

ఆదేశించినా చర్యలుండవా.!

» కేజీహెచ్ సూపరింటెండెంట్‌పై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ అసహనం

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ అధికారుల తీరుపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అసహనం వ్యక్తం చేశారు. అత్యాచారా నికి గురై వన్‌స్టాప్ సఖి సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శిం చేందుకు వచ్చిన ఆమె కొన్ని అంశాల పై ఆస్పత్రి సూపరింటెం డెంట్‌ను నిలదీశారు. ఆస్పత్రిలో తన కుమార్తెకు చికిత్స అందిం చేందుకు వచ్చిన ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడం టూ గత నెలలో వచ్చిన ఫిర్యాదుపై చర్యలు తీసు కోవాల ని ఆదే శించినా ఎందుకు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యుడైన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలంటూ రెండుసార్లు మెయిల్ పంపించినా స్పందించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గత నెలలో అనస్థీషియా విభాగానికి చెందిన వైద్యురాలిపై అసభ్యంగా ప్రవర్తించిన ఎంఎన్‌వోపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించినట్టు తెలిసింది. మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకునే విషయంలో నిర్లక్ష్యం వద్దని, ఈ తరహా చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ రెండు కేసుల్లో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

కాపర్ ప్లేట్లను కరిగించేశారు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్టీల్ ప్లాంటులో కాపర్ ప్లేట్ల చోరీ కేసు రోజుకొక మలుపు తిరుగుతోంది. బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో జూన్ నెలలో తొలగించిన 45 స్క్రాప్ కాపర్ ప్లేట్లను స్టోర్సులో భద్రపరచగా, ఆరు ప్లేట్లు మాయమైనట్టు రెండు వారాల క్రితం అధికారులు గుర్తించారు. దీనిపై గత నెల 28న ఉక్కు అధికారులు స్టీల్ ప్లాంటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఆరు ప్లేట్లలో రెండింటిని ప్లాంటులోని ఆర్ఎంహెచ్‌పీ విభాగం వద్ద గల పొదల్లో ఉన్నట్టు ఈ నెల రెండో తేదీన పోలీసులు గుర్తించారు. మిగతా నాలుగు ప్లేట్లను ప్లాంటు బయట గల ఓ స్క్రాప్ దుకాణం వద్ద కరిగించి 50 కిలోల చొప్పున 41 చిన్నపాటి దిమ్మలుగా మార్చినట్టు గుర్తించారు. దీంతో వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు సాగిస్తున్నామని, ఇందుకు సంబంధించి ఇప్పటికే గాజువాక ప్రాంతానికి చెందిన రాజా, రామస్వామి, ప్రకాశ్‌లను అరెస్టు చేశామని క్రైమ్ సీఐ కె.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఒక్కో కాపర్ ప్లేటు సుమారు టన్నున్నర బరువు ఉంటుంది. అలాంటిది నాలుగు ప్లేట్లను కట్టుదిట్టమైన భద్రత గల ప్లాంట్ నుంచి ఎలా బయటకు తెచ్చారన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ చోరీలో ఎవరి పాత్ర ఎంతనేది పోలీసుల విచారణలో తేలనున్నది. కాగా ఎఫ్ఎండీ విభాగంలోని ఓ నాయకుడు దీని వెనక ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

బాలికపై లైంగిక దాడి దురదృష్టకరం

... 5వ పేజీ తరువాయి

పరామర్శించారు. అనంతరం చైర్ పర్సన్ శైలజ మీడియాతో మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించడంతోపాటు బాధితురాలికి ప్రభుత్వపరంగా అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. బాలికను ప్రత్యేక స్కూల్‌లో చదివించడంతోపాటు అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ప్రభుత్వం అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఈ తరహా ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. పిల్లల నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని ఆమె తల్లిదండ్రులను కోరారు.

పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు నోటీసులు

... 5వ పేజీ తరువాయి

తీశారు. నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన ఉంటే వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీచేయవద్దని స్పష్టంచేశారు. ఒకవేళ సర్టిఫికెట్ ఇస్తే మాత్రం వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాన్ మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను రెండు రోజులు కంటే ఎక్కువకాలం లాగిన్‌లో ఉంచకుండా పైఅధికారులకు పంపించాలని ఏసీపీ ఝాన్సీలక్ష్మిని ఆదేశించారు. ఆస్తిపన్ను వసూలు ఆశించినంతగా లేకపోవడంతో పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆస్తిపన్ను చెల్లించని వారి ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించారు. జోన్‌లో పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలని, రాత్రి పారిశుధ్య నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. శానిటరీ సెక్రటరీలు ఉదయాన్నే వార్డులో పర్యటించి పారిశుధ్య సిబ్బంది హాజరు, పనితీరును పరిశీలించడంతోపాటు క్లాప్ వాహనంతో వెళ్లి ఇంటింటికీ చెత్తసేకరణ ఎలా జరుగుతుందనేదాని పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో నీరు నిల్వలేకుండా జాగ్రత్తపడడం ద్వారా సీజనల్ వ్యాధులను నియంత్రించాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు.

సెంటర్ మీడియన్‌లలో పచ్చదనం ఉండాలని, మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్తవి వెంటనే నాటాలని హార్టికల్చర్ అధికారి వెంకటరమణను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ శ్రీధర్, మురళీకృష్ణ, ఏఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహా మాయగాళ్లు

... 5వ పేజీ తరువాయి

అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ తొలిసమావేశం ఈ ఏడాది జూన్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఆశీలు వసూలుకు సంబంధించిన అంశాలను అజెండాలో పొందుపరిచారు. వీటిపై చర్చించిన సభ్యులు గాజువాక, పూర్ణామార్కెట్‌లో ఆశీలును సంబంధిత కాంట్రాక్టర్లే వసూలు చేస్తున్నందున వేలంలో పేర్కొన్న పూర్తిమొత్తాన్ని చెల్లించాలని స్పష్టంచేశారు.

డిపార్టుమెంట్ కలెక్షన్లు జరుగుతున్నచోట మాత్రం మూడు నెలలు మినహాయించి మిగిలిన తొమ్మిది నెలలకు వేలంలో పేర్కొన్న మొత్తాన్ని వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పూర్ణామార్కెట్ ఆశీలు కాంట్రాక్టర్ నుంచి పూర్తిమొత్తం వసూలు చేయాలని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు, గాజువాక కాంట్రాక్టర్ నుంచి ఏడాది కాలానికి పూర్తిమొత్తం వసూలు చేయాలని జోన్-6 కమిషనర్ శేషాద్రికి మేయర్ పీలా శ్రీనివాసరావు స్పష్టంగా చెప్పడంతోపాటు మినిట్స్‌లో కూడా నమోదుచేయాలని కార్యదర్శి బీవీ రమణను ఆదేశించారు. అయితే ఏం జరిగిందో తెలియదుగానీ...పూర్ణామార్కెట్ కాంట్రాక్టర్ నుంచి ఏడాది కాలానికి వేలం మొత్తాన్ని కట్టాలని ఆదే శిస్తూ వర్క్ఆర్డర్ ఇవ్వగా, గాజువాక మార్కెట్‌లో ఆశీలు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు మాత్రం మూడు నెలలు మినహాయించి తొమ్మిది నెలలకు మాత్రమే వర్క్ ఆర్డర్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. మొదటి మూడు నెలలు కూడా అదే కాంట్రాక్టర్ ఆశీలు వసూలుచేసుకున్నట్టు మేయర్‌తోపాటు స్టాండింగ్ కమిటీ సభ్యుల ముందు చెప్పిన జోన్-6 రెవెన్యూ అధికారులు తర్వాత స్టాండింగ్ కమిటీ తీర్మానానికి విరుద్ధంగా కాంట్రాక్టర్‌కు మేలు చేసేందుకు యత్నించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్ణయంతో జీవీఎంసీ సుమారు రూ.54 లక్షల మేర ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై రెవెన్యూ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావు దృష్టి సారించాలని కోరుతున్నారు.

సింహాచలం సిరి గల్లంతు!

... 5వ పేజీ తరువాయి

ఆభరణాలు బరువు తగ్గినట్టు పేర్కొన్నారని, దేవస్థానానికి చెందిన ఉప ఆలయాల్లో 16 వెండి వస్తువులు గుర్తించామని, వాటి వివరాలు ఎక్కడా నమోదు చేయలేదని నివేదించినట్టు సమాచారం. కొండదిగువన పూదోటలోని వేంకటేశ్వరస్వామికి 111.38 గ్రాముల బంగారు ముత్యాల హారం ఉండాలని రిజిస్టర్‌లో నమోదుచేసి ఉండగా, ఆలయంలో 36 గ్రాముల బంగారు గొలుసు మాత్రమే ఉన్నట్టు గుర్తించారు. అప్పన్న ఆలయ ప్రాంగణంలోని ఆభరణాల మ్యూజియంలో సుమారు 6.2 గ్రాముల బరువు గల 10 బంగారు గొలుసు ముక్కల ఆచూకీ దొరకలేదని పేర్కొన్నారు.

ఆ వెండి వస్తువులకు లెక్కల్లేవు

సింహాచలం దేవస్థానానికి 12 ఉప ఆలయాలు ఉన్నాయి. వాటికి భక్తులు దఫదఫాలుగా వివిధ రూపాల్లో 9.464 కిలోల వెండి వస్తువులు బహుమతిగా ఇచ్చారు. వాటిని అక్కడి పూజార్లు అధికారులకు అప్పగించి, రికార్డుల్లో నమోదు చేయించాల్సి ఉంది. కానీ మొత్తం 16 వెండి వస్తువులను లెక్కలు చూపించకుండా ఉంచారు. ఆయా ఆలయాల్లో వాటిని పూజాది కార్యక్రమాలకు వాడుతున్నప్పటికీ, వీటికి సంబంధించిన వివరాలు దేవస్థానానికి చెందిన రిజిస్టర్‌లో నమోదు చేయలేదనే విషయం జేఈవో గుర్తించి నివేదికలో పొందుపరిచారు. భక్తుల నుంచి కానుకలు స్వీకరించినప్పుడు రశీదులు ఇవ్వాలి. ఆ వివరాలు రిజిస్టర్‌లో నమోదుచేయాలి. కానీ దేవస్థానం అధికారులు గానీ, ఆలయ పర్యవేక్షకులు గానీ ఈ విషయాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు వెల్లడవుతున్నదని జేఈవో వ్యాఖ్యానించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీనికి కారకులైన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

చర్యలు చేపట్టకుండా కమిటీ నియామకం

జేఈఓ ఇచ్చిన నివేదిక ప్రకారం చర్యలు చేపట్టాల్సిన కమిషనర్ కార్యాలయం ఎందుకనో పునరాలోచన చేసింది. ఈ వ్యవహారంపై ఐదుగురు అధికారులతో ఒక కమిటీని ఏప్రిల్‌లో నియమించింది. చందనోత్సవం ముగిసిన వెంటనే ఆలయంలో ఆభరణాల లెక్కలన్నీ తేల్చి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అందులో మళ్లీ జేఈఓ పల్లంరాజును కూడా ఒక సభ్యుడిగా నియమించింది. వీరంతా గత నెల సింహాచలం వచ్చి కొన్ని ఆభరణాలను పరిశీలించి లెక్కించారు. ఇంకా మరికొన్ని లెక్కలు చూడాల్సి ఉంది. అయితే వైదిక కార్యక్రమాలతో బిజీగా ఉన్నందున కమిటీ వచ్చినప్పుడు ఉప ఆలయాల పూజార్లు హాజరుకాలేకపోతున్నారు. దాంతో లెక్కలు ఇంకా తేలలేదు. తొలి విచారణ జరిగి ఆరు నెలలు, కమిటీ విచారణకు ఆదేశం ఇచ్చి నాలుగు నెలలైనా ఇంకా ఏ విషయం తేల్చకుండా కాలయాపన చేస్తున్నారు. దీనిని కమిషనర్ కార్యాలయం కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పాలనాపరమైన తప్పులు జరుగుతున్నప్పుడు తక్షణ చర్యలు చేపట్టకుండా ఇలా జాప్యం చేయడం మంచిది కాదని దేవదాయ శాఖ వర్గాలే చెబుతున్నాయి.

శాయ్ హాస్టల్‌లో వాలీబాల్ శిక్షణకు ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు అథారిటీ స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ట్రైనింగ్ సెంటర్‌లో బాలురు, బాలికల వాలీబాల్ రెసిడెన్షియల్ హాస్టల్ ప్రవేశ ఎంపికలకు ఆసక్తిగలవారు హాజరు కావచ్చునని శాయ్ సెంటర్ ఇన్‌చార్జి, చీఫ్ వాలీబాల్ కోచ్ ఎం.సత్యనారాయణ తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపికలలో కొందరు మాత్రమే అర్హత సాధించారని, దీంతో మిగిలిన ఖాళీలు భర్తీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా మరోసారి ఎంపికలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే బాలురు, బాలికల వయసు 15ఏళ్లలోపు, కనీసం 190 సెం.మీ (బాలురు), 170 సెం.మీ (బాలికలు) ఎత్తు ఉండాలని స్పష్టం చేశారు. ఔత్సాహికులు నేరుగా ఫోన్:78934 77927 నందు సంప్రదించి హాజరు కావాలని కోరారు.

సింహాచలం పరిసరాల్లో మ్యూజియం ఏర్పాటుకు స్థలం కోసం వినతి

» ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన బ్రహ్మకుమారీ రామేశ్వరి

వెంకోజీపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం లేదా పరిసర ప్రాంతాల్లో ఒక ఆధ్యాత్మిక , శాస్త్రీయపరమైన మ్యూజియం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును బ్రహ్మకుమారీ రామేశ్వరి మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీ రామేశ్వరి మాట్లాడుతూ ఈ అధ్యాత్మిక మ్యూజియంలో సనాతన ధర్మాన్ని అర్థం పట్టే విధంగా దేవతల విగ్రహాలతో పాటు, సామాజిక నైతిక విలువలు తెలియజేసేలా అన్ని వయసుల వారికి ఆత్మజ్ఞానాన్ని బోధించుటకు సుందరమైన చిత్రాలను అమర్చాలనుకుంటున్నామని సీఎంకు వివరించారు. చదువుకునే విద్యార్థులకు సైన్స్ పరమైన ఆధ్యాత్మికతను కలిపి జ్ఞానాన్న బోధించి విజ్ఞానాన్ని పెంపొందించేందుకు మరికొన్ని చిత్రాలను ఏర్పాటు చేయదలచామమన్నారు. భక్తులకు వైద్య సౌకర్యార్థం ఒక చిన్న చికిత్సాలయం ఉంటుదని, ఇందుకోసం ప్రథమ చికిత్స నిమిత్తం రెండు గదులతో ఏర్పాటు చేయదలచామని, వీటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింహాచలం కొండ దిగువ ప్రాంతంలో భక్తులు మెట్లు ఎక్కే చోట ఒక వెయ్యి గజాలను తమ సంస్థకు ఇప్పించాలని కోరారు. ఒక వేళ దేవదాయ శాఖ స్థలంలో అవకాశం లేకుంటే పక్కన ఉన్న ఏదైనా ప్రభుత్వ భూముల్లో 3 వేల గజాల స్థలాన్ని ఈ పుణ్యకార్యం కోసం కేటాయించాలని సీఎంను కోరారు. మాదకద్రవ్యాల సేవనం, మత్తు పానీయాలకు అలవాటు పడడం ద్వారా చదువుకునే విద్యార్థులు, యువత నిర్వీర్యం అయిపోకుండా ఒక ఆధ్యాత్మిక జ్ఞాన విజ్ఞాన మ్యూజియంలోని విషయాలను తెలియపరిచినట్టయితే వారిలో ఆలోచనా విధానం పరివర్తన అవుతుందన్నది తమ ఉద్దేశమన్నారు. శారీరక, మానసిక, సామాజిక, ఆధ్యాత్మిక నిరంతర సేవలను తాము ప్రజానీకానికి ఉచితంగా అందివ్వగలమని సీఎంకు చెప్పారు.

ఈ విషయాన్ని పరిశీలిస్తామని సీఎం హామీ ఇచ్చినట్టు ఈ సందర్భంగా బ్రహ్మకుమారీ రామేశ్వరి తెలిపారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

స్మార్ట్ రేషన్ కార్డుల్లో తప్పులా...

సరిచేసుకోండిలా..





మద్దిలపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ మొదలైంది. రేషన్ డిపోల్లో డీలర్లు ఈ కార్డులు సరఫరా చేస్తున్నారు. లబ్దిదారులు ఈనెల 15వ తేదీ లోగా రేషన్ కార్డులు తీసుకోవాలి. వచ్చే నెల నుంచి స్మార్ట్ రేషన్ కార్డు ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నారు. ఏటీఎం కార్డు సైజులో ఉండే ఈ స్మార్ట్ రేషన్ కార్డులపై క్యూఆర్ కోడ్ ముద్రించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే రేషన్ తీసుకున్న వివరాలు తెలిసేలా డిజైన్ చేశారు. అయితే కొంతమంది స్మార్ట్ రేషన్ కార్డుల్లో తప్పులు దొర్లడంతో ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో మ్యాపింగ్ అస్తవ్యస్తంగా ఉండడంతో కొన్ని చోట్ల ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పేరు, చిరునామా, బంధుత్వాల నమోదులో తప్పులు, ఫోటో స్పష్టంగా లేకపోవడం, మహిళా పేరుతో రేషన్ కార్డు రావాల్సి వుండగా పురుషుల పేరుతో రావడం వంటి అంశాలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ తప్పుల వల్ల సంక్షేమ పథకాలు ఆగిపోతాయేమోనని చాలా మంది ఆందోళన చెందుతున్నారు. కానీ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ఈ సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. స్మార్ట్ రేషన్ కార్డులో తప్పులు ఉంటే వెంటనే సంబంధిత సచివాలయంలో లబ్ధిదారులు సంప్రదించాలి. పేరు, చిరునామా లేదా బంధుత్వంలో తప్పులు పడితే ఆధార్ కార్డు, పాత రేషన్ కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలి.

15లోగా స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకోవాలి

తూర్పు నియోజకవర్గంలో పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్‌కార్డులను 15వ తేదీ లోపు లబ్దిదారులు తీసుకోవాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే చాలామంది లబ్ధిదారులకు తమ స్మార్ట్ కార్డు ఎక్కడ ఉందో తెలియడం లేదు. ఈ కార్డులను ట్రాక్ చేయడానికి సచివాలయ సిబ్బంది, రేషన్ డిపో డీలర్లకు ఒక యాప్ ఇచ్చారు. లబ్ధిదారులు రేషన్ డిపోలు లేదా సచివాలయంలో రేషన్ కార్డు నంబర్ చెబితే యాప్‌లో చెక్ చేసి ఎక్కడ డిపో డీలర్ వద్ద ఉందో చెబుతారు. అక్కడకు వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డు పొందవచ్చు. కొత్త స్మార్ట్ కార్డు రాకపోయినా పాత కార్డు ద్వారా రేషన్ సరుకులు తీసుకోవచ్చు. కార్డులు రాకపోతే ఏరియా సచివాలయాన్ని సంప్రదించాలి. సిబ్బంది చెక్ చేసి ఎందుకు రాలేదో వివరిస్తారు.

యుద్ధ ప్రాతిపదికన గెడ్డల్లో వ్యర్థాల తొలగింపు

» అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం



ఇసుకతోట వద్ద గెడ్డను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు పడుతున్న నేపథ్యంలో నగరంలో ఉన్న గెడ్డలు, కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించి, ఆ వ్యర్థాల తరలింపునకు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జీవీఎంసీ 3వ జోన్ 16వ వార్డులోని ఇసుకతోట వద్ద కృష్ణ మందిరానికి ఆనుకుని ఉన్న ప్రధాన గెడ్డను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు పడుతుండడంతో గెడ్డల్లో వ్యర్థాలు పేరుకుపోయి అడ్డంకులు ఏర్పడుతున్నాయని వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇసుకతోట వద్ద కృష్ణ మందిరానికి ఆనుకుని ఉన్న ప్రధాన గెడ్డలో అధికంగా వ్యర్థాలు పేరుకుపోయి ప్రధాన రోడ్డు అంతర్భాగంలో అడ్డంకులు ఏర్పడినందున వాటిని గమనించి యంత్ర సహాయంతో యుద్ధ ప్రాతిపదికన వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. గెడ్డలో వ్యర్థాలు పేరుకుపోయి అడ్డంకులు ఏర్పడకుండా స్టీల్ మెస్సును వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ పల్లమరాజును కమిషనర్ ఆదేశించారు. అలాగే నగరంలో ఎన్ని గెడ్డలు ఉన్నాయని ఆరా తీస్తూ, అవసరమైన ప్రతి చోట గెడ్డకు అడ్డంగా స్టీల్‌మెస్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి నివేదించాలని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను ఆదేశించారు. నిత్యం ప్రధాన రోడ్లలో స్లీపింగ్ మిషన్‌తో రోడ్లను శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్‌కు స్పష్టం చేశారు. సమీపంలో రోడ్డు పక్కన ఉన్న వ్యాపార, తోపుడు బండ్ల కింద వ్యర్థాలు అధికంగా ఉన్నందున వార్డు శానిటరీ కార్యదర్శిని పరిశుభ్రతా ఎందుకుచర్యలు చేపట్టలేదని ఆరా తీశారు. ఆ వ్యాపారస్తులకు జరిమానా విధించమని కార్యదర్శిని ఆదేశించారు.

అలాగే కార్యదర్శి పరిధిలో ఎన్ని వాహనాలు, ఎంతమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు, వారి హాజరు తదితర వివరాలను చూపించాలని కోరాగా కార్యదర్శి తగిన వివరాలు చూపించలేకపోవడంతో ఆమెకు షోకాజ్ నోటీసును జారీ చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు.

అనంతరం అపోలో ఫార్మసీ సమీపంలో గ్రీన్‌బెల్ట్‌లో వ్యర్థాలు ఎక్కువగా పేరుకుపోయి ఉన్నందున హార్టికల్చర్ అధికారి వాసుకిని ఆరా తీస్తూ నిత్యం గ్రీన్ బెల్ట్‌లు సెంటర్ మీడియన్లు పరిశుభ్రంగా, పచ్చదనంతో నిండి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ, గంగాధర్, సుధాకర్, ఏఎంఓహెచ్ బి.ప్రసాద్ రావు, ఏఈ రహీం పాల్గొన్నారు.

జీఎస్టీ సవరణపై రాష్ట్రవ్యాప్త ప్రచారం

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.పరశురామ్‌రాజు తదతరులు

బీచ్ రోడ్డు, సెప్టెంబర్ 9, (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర వ్యాప్తంగా వ్యాపారులతో సహా ప్రజలందరిలో అవగాహన పెంపొందించేందుకు భారతీయ జనతా పార్టీ విస్తృత ప్రచారం నిర్వహిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్కే బీచ్‌లోని గల కాళీమాత దేవాలయం వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరళీకృత జీఎస్టీ ఈ నెల 22 నుంచి అమలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు నిర్వహిస్తున్నటు వెల్లడించారు. 2017లో జీఎస్టీ అమలులోకి వచ్చిందని తెలిపారు. ఇప్పడు దేశప్రజలకు ఊరటనిచ్చే విధంగా సరళీకరణ చేశారన్నారు. దీనివల్ల నిత్యావసర వస్తువుల ధరలు, అలాగే రైతాంగానికి అవసరమైన వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు. నిర్మాణ రంగానికీ ఉపశమనం కలుగుతుందని తెలిపారు. తద్వారా ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలకు ఊరట లభిస్తుందన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల అన్ని వర్గాల ప్రజలకూ దసరా, దీపావళి, సంక్రాంతి పండుగ సంబరాలు ముందే వచ్చాయన్న ఆనందాన్ని కలుగుతోందన్నారు.

14న నగరానికి జేపీ నడ్డా..

విశాఖకు 14న భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా వస్తున్నారని మాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే గ్రౌండ్‌లో భారీ బహిరంగసభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.పరశురామ్ రాజు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర కోశాధికారి నరేంద్ర, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కేశవకాంత్, రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసినీఆనంద్, ఆర్టీఐ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో ఈ-వ్యర్థాల నిర్వహణ కేంద్రం ప్రారంభం



ఈ-వ్యర్థాల నిర్వహణ యంత్రాన్ని పరిశీలిస్తున్న అజయ్‌కుమార్ సూద్, డాక్టర్ పర్వీందర్ షైనీ, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెడ్‌టెక్ జోన్‌లో ఈ-వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇదే మొదటి ఈ-వ్యర్థాల నిర్వహణ కేంద్రం. ఈ-వ్యర్థాల నిర్వహణలో దక్షిణ ప్రాంతీయ కేంద్రంగా మెడ్‌టెక్ జోన్‌లోని కేంద్రం పనిచేస్తుంది. కేవలం 234 రోజుల వ్యవధిలో నిర్మించిన ఈ భవనం ఎలక్ట్రానిక్స్ బయో మెడికల్ పరికరాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడానికి, రీసైకిల్ చేయడానికి రూపొందించబడిందని అధికారులు పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని మంగళవారం భారత ప్రభుత్వ పీఎస్ఏ కార్యదర్శి అజయ్‌కుమార్ సూద్, శాస్త్రీయ కార్యదర్శి డాక్టర్ పర్వీందర్ షైనీ, మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పరిశీలించారు.

తీరప్రాంత భద్రతపై మత్స్యకారులకు అవగాహన



పెదజాలారిపేటలో మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు

పెదవాల్తేరు, స్టెంబరు 9 : (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేట, రామలయం వీధి కల్యాణ మండపంలో మంగళవారం పోర్టు కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ అధ్వర్యంలో మత్స్యశాఖ, అటవీశాఖ వారితో కలిసి తీరప్రాంత భద్రతాపై స్థానిక మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వాహించారు. ఈ సందర్భంగా కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ సముద్రంలో అనుమానిత సామగ్రి లేదా అనుమానిత బోటుటు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా ప్రభుత్వ అధికారులకు తెలియజేయాలన్నారు. నేవీ వాళ్లకు సంబంధించిన ఏ పరికరాలు కనిపించినా వాటిని తెరవకుండా ఉన్నది ఉన్నట్టుగా అధికారులకు తెలియజేసి ప్రమాదాలకు దూరంగా ఉండాలని కోరారు. తీరప్రాంత భద్రతలో మత్స్యకారులు భాగస్వామ్యంచాలా అవసరమని అన్నారు. సమావేశంలో మత్స్యశాఖ, అటవీ, పోలీసు శాఖల సిబ్బంది గ్రామ కులపెద్ద తెడ్డు పరసన్న, టీడీపీ వార్డు నాయుకులు తెడ్డు రాజు, ఇతర గ్రామ కమిటీలు, స్థానిక సంప్రదాయ మత్స్యకారులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 32, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమ దుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	128
లైవ్ ధర	148
విత్ స్కిన్	266
స్కిన్‌లెస్	276

సమస్యల పరిష్కారం కోరుతూ భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ

» పోస్టు కార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన



పోస్టు కార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ పిలుపు మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునర్ ప్రారంభించాలని, గత ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల క్లైమ్‌ల నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఇసుకతోట పోస్టాఫీసు వద్ద భవన నిర్మాణ కార్మికులు పోస్టుకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. తొలుత ఇసుకతోట పెట్రోల్ బంకు జంక్షన్ నుంచి పోస్టాఫీసు వరకు తమ సమస్యలు రాసిన పోస్టుకార్డులు పట్టుకొని నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి పడాల రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారినా భవన నిర్మాణ కార్మికుల జీవన పరిస్థితులు మారలేదన్నారు. కార్మికులు శతాబ్ధాల కాలంగా పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996ను గత జగన్ ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి కార్మికులందరికీ అన్యాయం చేసిందన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే వెంటనే సంక్షేమ బోర్డును పునర్ ప్రారంభిస్తామని, పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌లకు నిధులు మంజూరు చేస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చారన్నారు. నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో 25 లక్షల మంది కార్మికులు సభ్యులుగా నమోదై ఉన్నారని, సంక్షేమ బోర్డులో నిధులు పుష్కలంగా ఉన్నా.. అనారోగ్యానికి గురై సహజ మరణం లేక రోజు ఏదో ఒక నిర్మాణం వద్ద ప్రమాదవశాత్తూ మృతి చెందిన కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికుల సంక్షేమం దిశగా ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ముందుకు సాగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇసుకతోట భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు బి.ప్రతాప్, సెక్రటరీ ఎం.నాగేశ్వరరావు, నాయకులు జి.పాపారావు, బి.నారాయణ, పి.ఈశ్వరరావు, డి.పైడిరాజు, సీహెచ్ చిన్నా, సత్య తదితరులు పాల్గొన్నారు.

పీఎం టీబీ ముక్త భారత్ వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు, పాల్గొన్న వైద్య సిబ్బంది

ఆరిలోవ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11వ వార్డులో గల గాంధీనగర్ కమ్యూనిటీ హాలులో ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ మెడికల్ క్యాంపును మంగళవారం టీడీపీ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, సంగ అధ్యక్షుడు క్యాటిరింగ్ రాజు ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి అధిక సంఖ్యలో రోగులు వచ్చి వైద్యపరీక్షలు చేసుకున్నారు. అధిక శాతం పేద ప్రజలు ఉన్న గాంధీనగర్‌లో ఇటువంటి వైద్య శిబిరాలు మరిన్ని నిర్వహించాలని స్థానికులు ప్రధానమంత్రి ముక్త భారత్ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ముక్త భారత్ మెడికల్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, టీబీ సూపరవైజర్ లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన యువత అభివృద్ధిపై దృష్టి సారించాలి

» ఏయూ వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్



ఏయూ వీసీ రాజశేఖర్‌తో అధికారులు, విద్యార్థులతో

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన యువతను సాధికా రిత దిశగా నడిపించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. పాలక మండలి సమావేశ మందిరంలో మంగళవారం అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ యువతలో నైపుణ్యాలను పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించా రు.వారిలో విభిన్న నైపుణ్యాలను పెంపొందించి, ఉద్యో గాలు సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. సాధారణ విద్యతోపాటు ప్రత్యేకమైన నైపుణ్యాలను అందించే శిక్షణ కార్యక్రమాలను ప్రణాళికాయుతంగా నిర్వ హించాలని సూచించారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు సమాజానికి ఉపయుక్తంగా నిలిచే కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేయాలని సూచించారు. సోషల్ ఇంక్లూషన్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ ఆదివాసీగ్రామం శంభువానిలపాలెంలో ఇటీవల సర్వే చేమని, అర్హులైన యువతను గుర్తించి ఉపాధికి దోహదపడే నైపుణ్య కార్యక్రమాల్లో ప్రవేశం కల్పించామన్నారు. ఏయూలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న 25 మందికి పైగా ఎస్టీ యువతకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ ప్రొఫెసర్ వల్లీకుమారితదితరులు పాల్గొన్నారు.

ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి

» కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి

సిరిపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయిస్తే లాభాలబాటలో పయనిస్తుందని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్ష శిబిరానికి మంగళవారం ఆమె సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్లాంటును ఎన్డీయే ప్రభుత్వం ప్రైవే ట్ వ్యక్తులకు అప్పగించాలని చూస్తోందని, ఈ నిర్ణయాన్ని ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రధానమంత్రి మోదీకి చిత్తశుద్ధి ఉంటే స్టీల్‌ప్లాంట్‌ను పునరుద్ధరించి అప్పలను ఈక్విటీగా తీసుకొని నడిపించాలని డిమాండ్ చేశారు. బడా కంపెనీలకు రూ.లక్షల కోట్లు రుణమాఫీ చేసిన బీజేపీ ప్రభుత్వం రూ.వేలు కోట్లు స్టీల్‌ప్లాంట్ రుణాన్ని మాఫీ చేయలేదా అని ప్రశ్నించారు. ప్లాంట్‌లో తొలగించిన వేలాది మంది కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణపై కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని పార్లమెంట్ సాక్షిగా వెనక్కు తీసుకోవాలన్నారు. ఈ అంశంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అన్ని పార్టీల నేతలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ, ఉక్కు పరిరక్షణ కమిటీ నేతలు డి.ఆదినారాయణ, అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్, జిల్లా కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ భోగవిల్లి నాగభూషణం, బీవీ రామ్, కె.దేవా, గుత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ



నిరసనలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి

సిరిపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానాన్ని రద్దు చేసి అన్ని మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పీడీఎస్ఓ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 4న సీఎం అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో 17 కొత్త వైద్య కళాశాలల్లో పదింటిని పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించడం దారుణమన్నారు. వీటిని 33 ఏళ్ల లీజుకు ఇవ్వడం ద్వారా 1,500 ఎంబీబీఎస్ సీట్లు ప్రభావితమవుతాయన్నారు. ఫీజులు పెరుగుతాయన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఈ జీవోలను 100 రోజుల్లో రద్దు చేసి 100 సీట్లను ప్రభుత్వ కోటాలో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత హామీలన్నీ గాలికి వదిలేశారన్నారు. తక్షణమే ఈ నిర్ణయాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జానకి, లక్ష్మణ్, లోకేశ్, లైకోన్, తులసి, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధాంజనేయస్వామికి సింధూర అర్చన



మురళీనగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని శ్రీ యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక సింధూర అర్చనలు చేపట్టారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్ శ్రీపాంచరాత్ర ఆగమ సాంప్రదాయంలో పూజా కార్యక్రమాలు జరిపారు. స్వామి సన్నిధిలో భక్తులతో సామూహిక సుందరకాండ పారాయణం నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలతో మంత్రపుష్పం సమర్పించారు. స్థానికులు, పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక అలంకరణలోని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు పి.సుబ్బరాజు, కమిటీ సభ్యులు ఎం.వి.రాజశేఖర్ భక్తులకు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారం కోరుతూ గిగ్ వర్కర్ల బైక్ ర్యాలీ

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్విగ్గీ, జుమాటో రైడర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13, 14 తేదీల్లో జరగనున్న బంద్ విజయవంతం చేయాలని ఆలిండియా గిగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బి.జగన్ కోరారు. డైమండ్ పార్కు సమీపం సాయిరాం పార్లర్ వద్ద మంగళవారం బైక్ యాత్ర చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి శని, ఆదివారాల్లో సమ్మె చేస్తామన్నారు. జిల్లాలో ఏడేళ్లుగా స్విగ్గీ, జుమాటో ప్లాట్‌ఫారంలో పని చేస్తున్న సుమారు 40 వేల మంది గిగ్ వర్కర్లు రోజూ సేవలందిస్తున్నా ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య వస్తే పరిష్కరించే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

సమాచార శాఖ డీడీగా రమేష్‌కు పదోన్నతి

మహారాణిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని స్టేట్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఏడీగా పనిచేస్తున్న దున్న రమేష్‌కు సమాచార పౌర సంబంధాల శాఖలో డీడీగా పదోన్నతి లభించింది. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ విజయవాడలో ఉన్న డైరెక్టరేట్ కార్యాలయంలో బాధ్యతలు చేపడతారు.

25వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా వాసు



సీతంపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం పరిధి 25వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా ఇసరపు వాసు నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జిలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఇసరపు వాసు పేర్కొన్నారు.

45వ వార్డుకు భరణికాన రాజు



అక్కయ్యపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు టీడీపీ అధ్యక్షునిగా భరణికాన రాజు నియమితులయ్యారు. ఆయన పేరును ఎంపీ శ్రీభరత్, గండి బాబ్జి ప్రకటించారు. భరణికాన రాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వార్డు అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు ఇద్దరికీ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

దుర్గాగణపతి ఆలయం వద్ద నేడు అన్నసంతర్పణ

సీతంపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు 14న సత్కారం

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందిన తిరుమల శ్రీదేవి, జి.కుమారస్వామి, జీఎం సుజాత, ఎం.మోహనరావులను బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ, గాంధీ సెంటర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న సత్కరించనున్నట్టు వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు డా.ఎల్.బి.కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ఆచార్య వి.బాలమోహన్‌దాస్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, ఐఆర్ఎస్ అధికారి ఈదర రవికిరణ్, మాజీ ఐపీఎస్ అధికారి అత్తిలి సుధాకరరావు పాల్గొంటారని తెలిపారు.

రైల్వే కార్యకలాపాల్లో భద్రతకు పెద్దపీట: డీఆర్ఎం లలిత్ బొహ్రా



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్యకలాపాలలో భద్రత అంశాన్ని కీలకంగా పాటించాలని డీఆర్ఎం లలిత్ బొహ్రా సూచించారు. విజయనగరం రైల్వే ఇనిస్టిట్యూట్‌లో బుధవారం జరిగిన భద్రతా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించడం, సమయపాలనతో విధులను నిబద్ధతతో నిర్వహించడం ముఖ్యమన్నారు. నిబంధనల అమలులో ట్రాక్ మెయింటెనర్లు, లోకో పైలట్లు, అన్ని విభాగాల సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో ఆపరేషన్స్ సేఫ్టీ, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, మెకానికల్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలికాం, సివిల్ ఇంజనీరింగ్, కమర్షియల్ విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లలో మౌలిక సదుపాయాల తనిఖీ

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ మంగళవారం విశాఖలోని వివిధ స్టేషన్లలో పర్యటించి మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. ముందుగా విశాఖలోని మార్షలింగ్ యార్డుకు చేరి అక్కడి డిస్పాచ్ యార్డు, రిసెప్షన్ యార్డుతోపాటు గోపాలపట్నంలోని రైల్వే కార్యకలాపాలను పరిశీలించారు. గోపాలపట్నం, జగ్గయ్యపాలెం, వడ్లపూడి ప్రాంతాల్లోని గేట్ల వద్ద జరుగుతున్న ట్రాక్ అభివృద్ధి పనులను పరిశీలించి ట్రాఫిక్ సమస్యలకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. వడ్లపూడి నుంచి దువ్వాడ మీదుగా ఉత్తర సింహాచలం వరకు రైల్వే స్టేషన్లతోపాటు ఈ మార్గంలో జరుగుతున్న మూడు, నాలుగో లైను ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించి ట్రాఫిక్ సౌకర్యాల మెరుగుదలపై దృష్టి సారించారు. ఇంటర్ లాకింగ్ వ్యవస్థల నిర్వహణ పనులు, రైళ్ల రాకపోకల ప్రణాళికలను అధికారులతో సమీక్షించారు.

ఆదేశించినా చర్యలుండవా.!

» కేజీహెచ్ సూపరింటెండెంట్‌పై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ అసహనం

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ అధికారుల తీరుపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అసహనం వ్యక్తం చేశారు. అత్యాచారానికి గురై వన్‌స్టాఫ్ సఖి సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించేందుకు వచ్చిన ఆమె కొన్ని అంశాలపై ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను నిలదీశారు. ఆస్పత్రిలో తన కుమార్తెకు చికిత్స అందించేందుకు వచ్చిన ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడంటూ గత నెలలో వచ్చిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఎందుకు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యుడైన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలంటూ రెండుసార్లు మెయిల్ పంపించినా స్పందించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గత నెలలో అనస్థీషియా విభాగానికి చెందిన వైద్యురాలిపై అసభ్యంగా ప్రవర్తించిన ఎంఎన్‌వోపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించినట్టు తెలిసింది. మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకునే విషయంలో నిర్లక్ష్యం వద్దని, ఈ తరహా చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ రెండు కేసుల్లో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

సీతమ్మధారలో పార్కుల అభివృద్ధి



శిలాఫలకాల వద్ద ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు తదితరులు

సీతమ్మధార, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక 14వ వార్డు సీతమ్మధారలో గల హిల్ వ్యూ పార్కు సహా మరో రెండు పార్కుల అభివృద్ధికి ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు మంగళవాం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్ రాజుతో కలిసి ఆయన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. రూ.88.9 లక్షల వ్యయంతో పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, నియోజకవర్గం ఇంచార్జ్ సురేష్ బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎండి నజీర్, ప్రకాశ్‌రావు, హేమ, హరిత కల్యాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మహిళా క్రికెట్ టిక్కెట్ విక్రయాలు ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐసీసీ మహిళల వరల్డ్ కప్ టోర్నీలో భాగంగా ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా అక్టోబరు 9 నుంచి జరగనున్న ఐదు మ్యాచ్‌లకు టికెట్ల అమ్మకాలు ఆన్‌లైన్‌లో మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. 'బుక్ మై షో'లో టికెట్ల అమ్మకాలు చేపట్టారు. స్టేడియంలోని జీ, ఎఫ్, డి, సి, కే, ఎం1 స్టాండ్స్‌కు సంబంధించి టికెట్లను విడుదల చేశారు. తొలిరోజు కేవలం 150 టికెట్లను మాత్రమే అందుబాటులో ఉంచారు. విశాఖలో అక్టోబరు 9న భారత్-దక్షిణాఫ్రికా, అక్టోబరు 12న భారత్-ఆస్ట్రేలియా, అక్టోబరు 13న దక్షిణాఫ్రికా-బంగ్లాదేశ్, అక్టోబరు 16న ఆస్ట్రేలియా-బంగ్లాదేశ్, అక్టోబరు 26న ఇంగ్లండ్-న్యూజిలాండ్ మధ్య జరగనున్న మ్యాచ్‌లకు టికెట్ల అమ్మకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం టికెట్ ధరను రూ.100లుగా ఆన్‌లైన్‌లో ఆన్‌లైన్‌లో టికెట్లు లభ్యమవుతున్నాయి.

'హలో డ్రైవర్ అన్న.. చలో కలెక్టరేట్' కరపత్రాల పంపిణీ



కరపత్రాలు చూపుతున్న ఆటో డ్రైవర్లు

సీతమ్మధార, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 11న చేపట్టనున్న 'హలో డ్రైవర్ అన్న చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు మంగళవారం కరపత్రాలు పంపిణీ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం (ఉచిత బస్సు ప్రయాణం) అమలు చేయడంతో ఆదాయం కోల్పోయిన తమను తక్షణమే ఆదుకోవాలని కోరారు. సీతమ్మధార కూడలి, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల, షిరిడి సాయిబాబా ఆటో స్టాండ్ వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు వాహన మిత్ర పథకం రూ.15 వేలు వెంటనే డ్రైవర్ ఖాతాలో జమ చేయాలని, డ్రైవర్లకు ప్రమాదకరంగా ఉన్న జీవో నెంబర్లు 21, 31 రద్దు చేయాలని కోరారు. 11న ఉదయం 9 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే ఆటోల ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.మధురెడ్డి, సన్యాసిరావు, నర్సింగ్, గంగూలి, లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువలకు అద్దం.. 'గబ్బిలం'



సమావేశంలో మాట్లాడుతున్న రచయిత గుంటూరు లక్ష్మీనర్సయ్య

సీతంపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న మహాకవి జాషువా జయంతి నేపథ్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సమతా సాహితి ఆధ్వర్యంలో 'మానవీయ సాహిత్య చిహ్నం జాషువా గబ్బిలం' అనే అంశంపై మంగళవారం సాహిత్య సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ రచయిత గుంటూరు లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ 'గబ్బిలం'లోని మానవీయ సాహిత్య విశేషాలను తెలియజేశారు. మానవీయ విలువలకు గబ్బిలం అద్దం పడుతుందన్నారు. గబ్బిలంలో పద్యాలు పాడి సభికులను అలరించారు. ఈ కార్యక్రమానికి సమతా సాహితి ప్రతినిధి డాక్టర్ మాటూరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో కుల వివక్ష ఉన్నంత కాలం గబ్బిలం లాంటి కావ్యాలు వస్తూనే ఉంటాయన్నారు. రచయిత డాక్టర్ కేవీఎస్ మూర్తి మాట్లాడుతూ జాషువా కవిత్వంలో విశేషాలు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బండి సత్యనారాయణ, కవులు సియార్కే, ఎన్.హనుమంతరావు, మిరప మహేష్, ఉప్పల అప్పలరాజు, రచయితలు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి బీమా పరిహారం



బాధిత కుటుంబానికి చెక్కు అందచేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు

సీతమ్మధార, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్‌పీఎఫ్) మధ్య ప్రత్యేక శాలరీ ప్యాకేజ్ ఒప్పందంలో భాగంగా సహజ మరణం సంభవించిన ఓ వ్యక్తి కుటుంబానికి రూ.15 లక్షల బీమా చెల్లించారు. ద్వారకానగర్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ ఖాతాదారు ఏపీఎస్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ కొణతల పరమేశ్వరరావు దురదృష్టవశాత్తు 2025 మే 31న అనారోగ్యంతో మరణించారు. 2024 మే 22న కుదిరిన ఒప్పందం ప్రకారం బ్యాంక్ వెంటనే బీమా మొత్తంరూ.15 లక్షల చెక్కును మరణించిన వ్యక్తి భార్య కొణతల అన్నపూర్ణకు అందజేసింది. ఈ చెక్కును ఏపీఎస్‌పీఎఫ్ విశాఖపట్నం యూనిట్ ఇన్‌స్పెక్టర్ జి.మహేష్, ఆయన బృందం, బ్యాంక్ ఆఫ్ బరోడా విశాఖపట్నం రీజినల్ హెడ్ అండ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ లీనా గొహైన్, రీజినల్ ఆఫీస్ సిబ్బంది సమక్షంలో అందచేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాల ఆర్థిక భద్రతకు బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాధాన్యం ఇస్తుందనడానికి ఇది ఉదాహరణ అని పేర్కొన్నారు.

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘం ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కె.అన్వేషి



నియామకపత్రం అందుకుంటున్న దృశ్యం

మహారాణిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కింగ్ జార్జ్ ఆసుపత్రి యువ వైద్యురాలు కె.అన్వేషి నియమితులయ్యారు. బి.సి. సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య నుంచి అన్వేషి నియామకపత్రాన్ని అందు కున్నారు. పలువురు ఆమెను అభినందించారు.

ఉత్సాహంగా స్వరఝరి

సీతంపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లో గల స్వరరాగ స్టుడియోలో మంగళవారం నిర్వహించిన బాలు స్వరఝరి సీజన్-2 సినీ సంగీత విభావరి ఆద్యంతం ఉల్లాసభరితంగా సాగింది. గాయనీ గాయకులు చక్కని గాత్ర ధర్మం పాటించి పలు చిత్రాల పాటలు పాడి శ్రోతలను అలరించారు. ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు నీలు, హనుమంతు, సుధాకర్, లఖినేని బాలకృష్ణ, జేఎస్ నివాస్, ఏవీ వెంకటరావు సంగీత అభిమానులు పాల్గొన్నారు.

శాయ్ హాస్టల్‌లో వాలీబాల్ ప్రవేశానికి ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు అథారిటీ స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ట్రైనింగ్ సెంటర్‌లో బాలురు, బాలికల వాలీబాల్ రెసిడెన్షియల్ హాస్టల్ ప్రవేశ ఎంపికలకు ఆసక్తిగలవారు హాజరు కావచ్చునని శాయ్ సెంటర్ ఇన్‌చార్జి, చీఫ్ వాలీబాల్ కోచ్ ఎం.సత్యనారాయణ తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపికలలో కొందరు మాత్రమే అర్హత సాధించారని, దీంతో మిగిలిన ఖాళీలు భర్తీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా మరోసారి ఎంపికలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే బాలురు, బాలికల వయసు 15ఏళ్లలోపు, కనీసం 190 సెం.మీ (బాలురు), 170 సెం.మీ (బాలికలు) ఎత్తు ఉండాలని స్పష్టం చేశారు. ఔత్సాహికులు నేరుగా ఫోన్:78934 77927 నందు సంప్రదించి హాజరుకావాలని కోరారు. ఎంపికైనవారికి ఆధునిక శిక్షణ, వసతి, భోజనం, ఏడాదికి రూ.15 వేలు విలువ చేసే స్పోర్ట్సు కిట్, చదువు నిమిత్తం ఏడాదికి రూ.మూడు వేలు, పోటీల్లో పాల్గొనేందుకు ఏడాదికి రూ.ఐదు వేలు, వైద్య ఖర్చులకు ఏడాదికి రూ.వెయ్యితోపాటు రూ.ఐదు లక్షల వరకు వైద్య బీమా సదుపాయం కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణపత్రం, ఐదు పాస్‌పోర్టుసైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు.

ఆంధ్ర వుమెన్ టీ20 చాంప్ విజయవాడ బ్లాస్టర్స్



విజయవాడ బ్లాస్టర్స్ ట్రోఫీ అందిస్తున్న టీమిండియా మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, విజేత జట్టు సభ్యులు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఆంధ్ర వుమెన్ టీ20 లీగ్ టోర్నీలో విజయవాడ బ్లాస్టర్స్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. రాయలసీమ రెయిన్స్ రన్నరప్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్స్‌లో విజయవాడ బ్లాస్టర్స్ 13 పరుగుల తేడాతో రాయలసీమ రెయిన్స్ గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ బ్లాస్టర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 165 పరుగులు చేయగా, ఛేదనలో రాయలసీమ రెయిన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 152 పరుగులు చేసి ఓటమి చెందింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి భారత మహిళల జట్టు మాజీ సారథి మిథాలీ రాజ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలతోపాటు నగదు బహుమతులు అందజేసి అభినందించారు.

దువ్వాడ మీదుగా హైదరాబాద్-భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా హైదరాబాద్-భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07165 నంబరు గల రైలు ఈ నెల 16 నుంచి అక్టోబరు 28 వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ, సాయంత్రం 5.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07166 నంబరు గల రైలు ఈ నెల 17 నుంచి అక్టోబరు 29 వరకు ప్రతి బుధవారం రాత్రి 10.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ, రాత్రి 10 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులకు నాలుగు సెకెండ్ ఏసీ, ఎనిమిది థర్డ్ ఏసీ, ఆరు స్లీపర్, రెండు జనరల్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

బనారస్ ఎక్స్‌ప్రెస్‌కు అంకోరాలో ప్రయోగాత్మక హాల్ట్

విశాఖ-బనారస్ మధ్య నడుస్తున్న బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 11 నుంచి అంకోరా స్టేషన్‌లో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-బనారస్ (18523) ఎక్స్‌ప్రెస్ రైలు అంకోరాలో ఉదయం 5.08 గంటలకు, తిరుగు ప్రయాణంలోని బనారస్-విశాఖ (18524) ఎక్స్‌ప్రెస్ రైలు అంకోరాకు సాయంత్రం 6.40 గంటలకు చేరుతాయని పేర్కొన్నారు.

కాపర్ ప్లేట్లను కరిగించేశారు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో కాపర్ ప్లేట్ల చోరీ కేసు రోజుకొక మలుపు తిరుగుతోంది. బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో జూన్ నెలలో తొలగించిన 45 స్క్రాప్ కాపర్ ప్లేట్లను స్టోర్సులో భద్రపరచగా, ఆరు ప్లేట్లు మాయమైనట్టు రెండు వారాల క్రితం అధికారులు గుర్తించారు. దీనిపై గత నెల 28న ఉక్కు అధికారులు స్టీల్ ప్లాంటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఆరు ప్లేట్లలో రెండింటిని ప్లాంటులోని ఆర్ఎంహెచ్‌పీ విభాగం వద్ద గల పొదల్లో ఉన్నట్టు ఈ నెల రెండో తేదీన పోలీసులు గుర్తించారు. మిగతా నాలుగు ప్లేట్లను ప్లాంటు బయట గల ఓ స్క్రాప్ దుకాణం వద్ద కరిగించి 50 కిలోల చొప్పున 41 చిన్నపాటి దిమ్మలుగా మార్చినట్టు గుర్తించారు. దీంతో వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు సాగిస్తున్నామని, ఇందుకు సంబంధించి ఇప్పటికే గాజువాక ప్రాంతానికి చెందిన రాజా, రామస్వామి, ప్రకాశ్‌లను అరెస్టు చేశామని క్రైమ్ సీఐ కె.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఒక్కో కాపర్ ప్లేటు సుమారు టన్నున్నర బరువు ఉంటుంది. అలాంటిది నాలుగు ప్లేట్లను కట్టుదిట్టమైన భద్రత గల ప్లాంట్ నుంచి ఎలా బయటకు తెచ్చారన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ చోరీలో ఎవరి పాత్ర ఎంతనేది పోలీసుల విచారణలో తేలనుంది. ఎఫ్ఎండీ విభాగంలోని ఓ నాయకుడు దీని వెనక ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

బాలికపై లైంగిక దాడి దురదృష్టకరం

... 5వ పేజీ తరువాయి

పరామర్శించారు. అనంతరం చైర్ పర్సన్ శైలజ మీడియాతో మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించడంతోపాటు బాధితురాలికి ప్రభుత్వపరంగా అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. బాలికను ప్రత్యేక స్కూల్‌లో చదివించడంతోపాటు అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ప్రభుత్వం అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఈ తరహా ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. పిల్లల నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని ఆమె తల్లిదండ్రులను కోరారు.

పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు నోటీసులు

... 5వ పేజీ తరువాయి

తీశారు. నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన ఉంటే వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీచేయవద్దని స్పష్టంచేశారు. ఒకవేళ సర్టిఫికెట్ ఇస్తే మాత్రం వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాన్ మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను రెండు రోజులు కంటే ఎక్కువకాలం లాగిన్‌లో ఉంచకుండా పైఅధికారులకు పంపించాలని ఏసీపీ ఝాన్సీలక్ష్మిని ఆదేశించారు. ఆస్తిపన్ను వసూలు ఆశించినంతగా లేకపోవడంతో పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆస్తిపన్ను చెల్లించని వారి ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించారు. జోన్‌లో పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలని, రాత్రి పారిశుధ్య నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. శానిటరీ సెక్రటరీలు ఉదయాన్నే వార్డులో పర్యటించి పారిశుధ్య సిబ్బంది హాజరు, పనితీరును పరిశీలించడంతోపాటు క్లాప్ వాహనంతో వెళ్లి ఇంటింటికీ చెత్త సేకరణ ఎలా జరుగుతుందనేదాని పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో నీరు నిల్వలేకుండా జాగ్రత్తపడడం ద్వారా సీజనల్ వ్యాధులను నియంత్రించాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. సెంటర్ మీడియన్‌లలో పచ్చదనం ఉండాలని, మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్తవి వెంటనే నాటాలని హార్టికల్చర్ అధికారి వెంకటరమణను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ శ్రీధర్, మురళీకృష్ణ, ఏఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహా మాయగాళ్లు

... 5వ పేజీ తరువాయి

అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ తొలిసమావేశం ఈ ఏడాది జూన్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఆశీలు వసూలుకు సంబంధించిన అంశాలను అజెండాలో పొందుపరిచారు. వీటిపై చర్చించిన సభ్యులు గాజువాక, పూర్ణామార్కెట్‌లో ఆశీలును సంబంధిత కాంట్రాక్టర్లే వసూలు చేస్తున్నందున వేలంలో పేర్కొన్న పూర్తిమొత్తాన్ని చెల్లించాలని స్పష్టంచేశారు. డిపార్టుమెంట్ కలెక్షన్లు జరుగుతున్నచోట మాత్రం మూడు నెలలు మినహాయించి మిగిలిన తొమ్మిది నెలలకు వేలంలో పేర్కొన్న మొత్తాన్ని వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పూర్ణామార్కెట్ ఆశీలు కాంట్రాక్టర్ నుంచి పూర్తిమొత్తం వసూలు చేయాలని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు, గాజువాక కాంట్రాక్టర్ నుంచి ఏడాది కాలానికి పూర్తిమొత్తం వసూలు చేయాలని జోన్-6 కమిషనర్ శేషాద్రికి మేయర్ పీలా శ్రీనివాసరావు స్పష్టంగా చెప్పడంతోపాటు మినిట్స్‌లో కూడా నమోదుచేయాలని కార్యదర్శి బీవీ రమణను ఆదేశించారు. అయితే ఏం జరిగిందో తెలియదుగానీ...పూర్ణామార్కెట్ కాంట్రాక్టర్ నుంచి ఏడాది కాలానికి వేలం మొత్తాన్ని కట్టాలని ఆదే శిస్తూ వర్క్‌ఆర్డర్ ఇవ్వగా, గాజువాక మార్కెట్‌లో ఆశీలు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు మాత్రం మూడు నెలలు మినహాయించి తొమ్మిది నెలలకు మాత్రమే వర్క్ ఆర్డర్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. మొదటి మూడు నెలలు కూడా అదే కాంట్రాక్టర్ ఆశీలు వసూలుచేసుకున్నట్టు మేయర్‌తోపాటు స్టాండింగ్ కమిటీ సభ్యుల ముందు చెప్పిన జోన్-6 రెవెన్యూ అధికారులు తర్వాత స్టాండింగ్ కమిటీ తీర్మానానికి విరుద్ధంగా కాంట్రాక్టర్‌కు మేలు చేసేందుకు యత్నించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్ణయంతో జీవీఎంసీ సుమారు రూ.54 లక్షల మేర ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై రెవెన్యూ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావు దృష్టిసారించాలని కోరుతున్నారు.

సింహాచలం సిరి గల్లంతు!

... 5వ పేజీ తరువాయి

ఆభరణాలు బరువు తగ్గినట్టు పేర్కొన్నారని, దేవస్థానానికి చెందిన ఉప ఆలయాల్లో 16 వెండి వస్తువులు గుర్తించామని, వాటి వివరాలు ఎక్కడా నమోదు చేయలేదని నివేదించినట్టు సమాచారం. కొండదిగువన పూదోటలోని వేంకటేశ్వరస్వామికి 111.38 గ్రాముల బంగారు ముత్యాల హారం ఉండాలని రిజిస్టర్‌లో నమోదుచేసి ఉండగా, ఆలయంలో 36 గ్రాముల బంగారు గొలుసు మాత్రమే ఉన్నట్టు గుర్తించారు. అప్పన్న ఆలయ ప్రాంగణంలోని ఆభరణాల మ్యూజియంలో సుమారు 6.2 గ్రాముల బరువు గల 10 బంగారు గొలుసు ముక్కల ఆచూకీ దొరకలేదని పేర్కొన్నారు.

ఆ వెండి వస్తువులకు లెక్కల్లేవు

సింహాచలం దేవస్థానానికి 12 ఉప ఆలయాలు ఉన్నాయి. వాటికి భక్తులు దఫదఫాలుగా వివిధ రూపాల్లో 9.464 కిలోల వెండి వస్తువులు బహుమతిగా ఇచ్చారు. వాటిని అక్కడి పూజార్లు అధికారులకు అప్పగించి, రికార్డుల్లో నమోదు చేయించాల్సి ఉంది. కానీ మొత్తం 16 వెండి వస్తువులను లెక్కలు చూపించకుండా ఉంచారు. ఆయా ఆలయాల్లో వాటిని పూజాది కార్యక్రమాలకు వాడుతున్నప్పటికీ, వీటికి సంబంధించిన వివరాలు దేవస్థానానికి చెందిన రిజిస్టర్‌లో నమోదు చేయలేదనే విషయం జేఈవో గుర్తించి నివేదికలో పొందుపరిచారు. భక్తుల నుంచి కానుకలు స్వీకరించినప్పుడు రశీదులు ఇవ్వాలి. ఆ వివరాలు రిజిస్టర్‌లో నమోదుచేయాలి. కానీ దేవస్థానం అధికారులు గానీ, ఆలయ పర్యవేక్షకులు గానీ ఈ విషయాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు వెల్లడవుతున్నదని జేఈవో వ్యాఖ్యానించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీనికి కారకులైన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

చర్యలు చేపట్టకుండా కమిటీ నియామకం

జేఈఓ ఇచ్చిన నివేదిక ప్రకారం చర్యలు చేపట్టాల్సిన కమిషనర్ కార్యాలయం ఎందుకనో పునరాలోచన చేసింది. ఈ వ్యవహారంపై ఐదుగురు అధికారులతో ఒక కమిటీని ఏప్రిల్‌లో నియమించింది. చందనోత్సవం ముగిసిన వెంటనే ఆలయంలో ఆభరణాల లెక్కలన్నీ తేల్చి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అందులో మళ్లీ జేఈఓ పల్లంరాజును కూడా ఒక సభ్యుడిగా నియమించింది. వీరంతా గత నెల సింహాచలం వచ్చి కొన్ని ఆభరణాలను పరిశీలించి లెక్కించారు. ఇంకా మరికొన్ని లెక్కలు చూడాల్సి ఉంది. అయితే వైదిక కార్యక్రమాలతో బిజీగా ఉన్నందున కమిటీ వచ్చినప్పుడు ఉప ఆలయాల పూజార్లు హాజరుకాలేకపోతున్నారు. దాంతో లెక్కలు ఇంకా తేలలేదు. తొలి విచారణ జరిగి ఆరు నెలలు, కమిటీ విచారణకు ఆదేశం ఇచ్చి నాలుగు నెలలైనా ఇంకా ఏ విషయం తేల్చకుండా కాలయాపన చేస్తున్నారు. దీనిని కమిషనర్ కార్యాలయం కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పాలనాపరమైన తప్పులు జరుగుతున్నప్పుడు తక్షణ చర్యలు చేపట్టకుండా ఇలా జాప్యం చేయడం మంచిది కాదని దేవదాయ శాఖ వర్గాలే చెబుతున్నాయి.


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొండా జగన్

'ప్రజా సంక్షేమానికి కృషి'

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో ఇటీవల ప్రారంభించిన అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను స్థానికులు కూడా పరిశీలించి నాణ్యతతో ఆయా పనులు జరిగేలా చూడాలని కోరారు. అనంతరం గణేశ్ నగర్‌లో హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్ఎస్ విజయరామరాజు, నాయకులు రాము, రాజన్‌రాజు, దానయ్య, పెంటారావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

పెదగంట్యాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై మహిళలు ఐక్యంగా పోరాడితే తప్పక పరిష్కారం లభిస్తుందని డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు అన్నారు. లంబోదర శ్రీశక్తి టిడ్కో మహిళా సంఘం సభ్యులకు మంగళవారం ఆయన గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా 64వ వార్డు జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాలకు మౌలిక వసతుల కోసం మహిళలు చేస్తున్న పోరాటానికి త్వరలోనే ఫలితం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రమణి, పీత లక్ష్మి, ప్రమీల, సీపీఐ నాయకులు జి.ఆనంద్, పి.దుర్గారావు, టిడ్కో గృహ లబ్ధిదారుల సంఘం ప్రతినిధులు పి.అప్పలరాజు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఈకి కూటమి నేతల వినతి

అగనంపూడి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన పీవీవీ సత్యనారాయణను 85వ వార్డు కూటమి నాయకులు మంగళవారం కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తొలుత ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం వార్డు పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వివరించారు. సీఈని కలిసిన వారిలో నాయకులు ఇల్లపు ప్రసాద్, బండారు చందూ రమేశ్, బి.సత్యనారాయణ, పి.అచ్యుత్, విజయ్, తదితరులు ఉన్నారు.

విజేతలకు అభినందనలు

పెందుర్తి-రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఎంఎంఏ జాతీయ చాంపియన్‌షిప్ మెడలిస్ట్ పోటీల్లో విశాఖ జిల్లా ఎఫ్‌సీ అకాడమీకి చెందిన పలువురు విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచి పలు బహుమతులు సాధించారు. గొర్లె మోహన్ గోల్డ్, కె.దిలీప్‌కుమార్ సిల్వర్, జి.కుమారస్వామి, కె.వెంకట కార్తీక్‌లు బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం బీజేపీ వార్డు కార్యాలయంలో వారిని కార్పొరేటర్ ముమ్మన దేముడు అభినందించారు. నాయకులు చిక్కాల సతీశ్, కె.అప్పలరాజు, కేవీ సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 18, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 16, క్యారెట్ 44, దొండకాయలు 32, బంగాళదుంపలు 19, అరటికాయ (పెద్దది) 8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, బద్దచిక్కుడు 50, నిమ్మకాయలు (కిలో) 65, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 32, క్యాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, గోరుచిక్కుడు 30, దేముడు చిక్కుడు 62, కూరపెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, బూడిద గుమ్మడికాయ 20, మామిడికాయలు 80, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్రాయ్లర్	
రైతు ధర	128
లైవ్ ధర	148
విత్ స్కిన్	266
స్కిన్‌లెస్	276

వానొస్తే హైవే చెరువే..

- వాహనదారులకు తప్పని తిప్పలు
- ట్రాఫిక్ పోలీసులు వినతులు సమర్పించినా స్పందించని ఎన్‌హెచ్ అధికారులు



జాతీయ రహదారి సరిపల్లి బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపు నీరు. (ఇన్‌సెట్లో) చెరువును తలపిస్తున్న సర్వీస్ రోడ్డు

పెందుర్తి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వానొస్తే చాలు నేషనల్ ఎక్స్‌ప్రెస్ సిక్స్ లేన్ల రహదారి చెరువును తలపిస్తోంది. రెండు రోజులుగా దంచికొట్టిన వర్షాలకు పెందుర్తిలోని జాతీయ రహదారితో పాటు పలు రోడ్లు సెలయేరులను తలపించేలా మారాయి. ఈ క్రమంలో పాత పెందుర్తి జాతీయ రహదారికి సమీపంలో గల పెద్ద చెరువు నిండుకుండలా మారడంతో పల్లపు ప్రాంతం నీరు కిందకు ప్రవహిస్తూ సిక్స్ లేన్ల రహదారి మీదుగా సరిపల్లి సర్వీస్ రోడ్డుపై చేరుతుంది. దీంతో సరిపల్లి హైవే బ్రిడ్జి అంతా నీటితో నిండి చెరువు మాదిరిగా దర్శనమిస్తోంది.

ఈ కారణంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. పలుచోట్ల వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రిపూట రాకపోకలు సాగించే వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలవకుండా పోయే మార్గం సక్రమంగా లేకపోవడం వల్లే రోడ్డుపై నీరు తిష్ట వేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ కారణంగా ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. వర్షపు నీటి కారణంగా సరిపల్లి సర్వీసు రోడ్డులో రాకపోకలు కష్టతరంగా మారిందని పలువురు ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది హైవేపై వర్షపు నీరు లేకుండా చర్యలు చేపడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఇక్కడ ఇదే సమస్య నెలకొంటుందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై వాన నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని పలుమార్లు ఎన్‌హెచ్ అధికారులకు రాతపూర్వకంగా వినతులిచ్చినా వారు స్పందించడం లేదని పోలీసులు పేర్కొంటున్నారు.

స్టీల్ ప్లాంట్ ప్రగతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

గాజువాక ప్రాంతానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు


విలేకరుల సమావేశంలో టీడీపీ కార్పొరేటర్లు, నాయకులు

గాజువాక, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటును పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, కానీ దీనిపై వామపక్ష నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని గాజువాక ప్రాంతానికి చెందిన టీడీపీ కార్పొరేటర్లు పేర్కొన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించాలనే సంకల్పంతో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి భారీ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిందన్నారు. ప్లాంట్ అభివృద్ధికి దారితీసేలా కర్మాగారానికి గల విద్యుత్ బిల్లును రద్దు చేయడం జరిగిందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రగతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్‌లు ప్లాంట్ కోసం తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారన్నారు. ఉక్కు నిర్వాసితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, బొండా జగన్, మొల్లి ముత్యాలనాయుడు, రౌతు శ్రీనివాస్, నాయకుడు పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సవరణపై రాష్ట్రవ్యాప్త ప్రచారం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- బీచ్ రోడ్డులో ప్రధాని నరేంద్ర మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

విశాఖపట్నం, సెప్టెంబర్ 9, (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర వ్యాప్తంగా వ్యాపారులతో సహా ప్రజలందరిలో అవగాహన పెంపొందించేందుకు భారతీయ జనతా పార్టీ విస్తృత ప్రచారం నిర్వహిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్కే బీచ్‌లోని గల కాళీమాత దేవాలయం వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరళీకృత జీఎస్టీ ఈ నెల 22 నుంచి అమలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు నిర్వహిస్తున్నటు వెల్లడించారు. 2017లో జీఎస్టీ అమలులోకి వచ్చిందని తెలిపారు. ఇప్పుడు దేశప్రజలకు ఊరటనిచ్చే విధంగా సరళీకరణ చేశారన్నారు. దీనివల్ల నిత్యావసర వస్తువుల ధరలు, అలాగే రైతాంగానికి అవసరమైన వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు.

నిర్మాణ రంగానికీ ఉపశమనం కలుగుతుందని తెలిపారు. తద్వారా ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలకు ఊరట లభిస్తుందన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల అన్ని వర్గాల ప్రజలకూ దసరా, దీపావళి, సంక్రాంతి పండుగ సంబరాలు ముందే వచ్చాయన్న ఆనందాన్ని కలుగుతోందన్నారు.

14న నగరానికి జేపీ నడ్డా..

విశాఖకు 14న భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా వస్తున్నారని మాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే గ్రౌండ్‌లో భారీ బహిరంగసభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.పరశురామ్‌రాజు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర కోశాధికారి నరేంద్ర, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కేశవకాంత్, రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసినీఆనంద్, ఆర్టీఐ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాధవ్

మెడ్‌టెక్ జోన్‌లో ఈ-వ్యర్థాల నిర్వహణ కేంద్రం ప్రారంభం


ఈ-వ్యర్థాల నిర్వహణ యంత్రాన్ని పరిశీలిస్తున్న అజయ్‌కుమార్ సూద్, డాక్టర్ పర్వీందర్ షైనీ, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెడ్‌టెక్ జోన్‌లో ఈ-వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇదే మొదటి ఈ-వ్యర్థాల నిర్వహణ కేంద్రం. ఈ-వ్యర్థాల నిర్వహణలో దక్షిణ ప్రాంతీయ కేంద్రంగా మెడ్‌టెక్ జోన్‌లోని కేంద్రం పనిచేస్తుంది. కేవలం 234 రోజుల వ్యవధిలో నిర్మించిన ఈ భవనం ఎలక్ట్రానిక్స్, బయో మెడికల్ పరికరాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడానికి, రీసైకిల్ చేయడానికి రూపొందించబడిందని అధికారులు పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని మంగళవారం భారత ప్రభుత్వ పీఎస్ఏ కార్యదర్శి అజయ్‌కుమార్ సూద్, శాస్త్రీయ కార్యదర్శి డాక్టర్ పర్వీందర్ షైనీ, మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్ర శర్మ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, తదితరులు పరిశీలించారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్ల సమావేశం

జాతీయ సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్ల సమావేశం మెడ్‌టెక్ జోన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ సీఈవో జితేంద్రశర్మ, శాస్త్రీయ కార్యదర్శి డాక్టర్ పర్వీందర్‌లు మాట్లాడుతూ భారతదేశంలో పెరుగుతున్న సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ల పర్యావరణ వ్యవస్థలో నూతన ఆవిష్కరణలు జరుగుతున్నాయన్నారు. కొత్త మెటీరియల్ అభివృద్ధి, తదితర అంశాలపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జోన్-8 ఇన్‌చార్జి జడ్సీగా శంకర్ నియామకం



వేపగుంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ వేపగుంట జోనల్ కార్యాలయం జోన్-8 ఇన్‌చార్జి జడ్సీగా హెచ్.శంకర్‌ను నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ జడ్సీగా ఉన్న కె.హైమావతి ఆరు నెలల పాటు మెటర్నరీ లీవ్‌పై వెళ్లారు. దీంతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పీజీఆర్ఎస్ డీపీఆర్‌గా పనిచేస్తున్న శంకర్‌కు ఇన్‌చార్జి జడ్సీగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టనున్నట్టు సమాచారం.

ఈఐపీఎల్‌లో అదుపులోకి రాని మంటలు

మల్కాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ఇండియా పెట్రోలియం లిమిటెడ్ (ఈఐపీఎల్) ట్యాంకులో మంటలు ఇప్పటికీ అదుపులోకి రాలేదు. ఈ నెల 7న పిడుగు పడడంతో అగ్ని ప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. మిథనాల్ ట్యాంక్ నుంచి మంటలు మంగళవారానికి కూడా తగ్గుముఖం పట్టలేదు. బుధవారం సాయంత్రానికి తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

కుటుంబ సభ్యులకు మహిళ అప్పగింత


స్వాతిని కుటుంబ సభ్యులకు అప్పగించిన సీఐ విజయ్‌కుమార్

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులకు చెప్పకుండా తిరుమలకు వచ్చి ఉంటున్న ఓ వివాహితను తిరుమల పోలీసులు గుర్తించి తిరిగి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లాకు చెందిన స్వాతి (38)కి 2013లో నవీన్ అనే వ్యక్తితో పెళ్లయింది. తొలినాళ్లలో ఈ దంపతులు లండన్‌లో ఉండేవారు. తర్వాత వీరిమధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో 2021లో స్వాతి లండన్ నుంచి వచ్చేసి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఇటీవల తల్లి మృతి చెందడంతో మనోవేదనకు గురైన స్వాతి 10 రోజుల క్రితం తిరుమల చేరుకుంది. ఆమె తండ్రి గోవిందరావు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో స్వాతి తిరుమలలో ఉన్నట్టు గుర్తించారు. తిరుమల పోలీసుల సహకారంతో వారు మంగళవారం ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తిరుమలకు చేరుకున్న కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంతకుముందు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు.


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి

- కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటుకు సొంత గనులు కేటాయిస్తే లాభాల బాటలో పయనిస్తుందని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్ష శిబిరానికి మంగళవారం ఆమె సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాంటును ఎన్డీయే ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని చూస్తోందని, ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. పీఎం మోదీకి చిత్తశుద్ధి ఉంటే స్టీల్ ప్లాంటును పునరుద్ధరించి అప్పులను ఈక్విటీగా తీసుకుని నడిపించాలని డిమాండ్ చేశారు. బడా కంపెనీలకు రూ.లక్షల కోట్లు రుణమాఫీ చేసిన కేంద్రం రూ.వేల కోట్ల స్టీల్‌ప్లాంట్ రుణాన్ని మాఫీ చేయలేదా అని ప్రశ్నించారు. ప్లాంటులో తొలగించిన వేలాది మంది కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ, ఉక్కు పరిరక్షణ కమిటీ నేతలు డి.ఆదినారాయణ, అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్, జిల్లా కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ భోగవిల్లి నాగభూషణం, టీవీ రామ్, కె.దేవా, గుత్తుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సినర్జీస్ కార్మికులకు ఏఐటీయూసీ సంఘీభావం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బకాయి పడిన జీతాలు చెల్లించాలంటూ గత 5 రోజులుగా ధర్నా చేస్తున్న సినర్జీస్ కార్మికులకు మంగళవారం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు బూసి వెంకట్రావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినర్జీస్ కంపెనీ యాజమాన్యం 7 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు అండగా ఐఏటీయూసీ ఉంటుందన్నారు. యాజమాన్యం స్పందించి తక్షణమే జీతాలివ్వాలని డిమాండ్ చేశారు.


జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

పెరుగుతున్న 'మేహాద్రిగెడ్డ' నీటిమట్టం

540 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు

గోపాలపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరగడంతో జలాశయం గేటును అరడుగు ఎత్తి 540 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 61 అడుగులు కాగా గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రస్తుతం 60.2 అడుగులకు చేరింది. దీంతో ఐదు రోజుల క్రితం రిజర్వాయర్ గేటును 3 అంగుళాలు ఎత్తి వరద నీటిని విడుదల చేయడంతో సోమవారం మధ్యాహ్నానికి నీటిమట్టం 59.6 అడుగులకు చేరింది. అయితే రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో పాటు చెరువులు నిండిపోవడంతో జలాశయానికి ఇన్‌ఫ్లో పెరుగుతుంది. రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తున్నా నీటిమట్టం పెరుగుతుండడంతో మంగళవారం ఉదయానికి నీటిమట్టం 60.2 అడుగులకు చేరింది. ఈ కారణంగా మధ్యాహ్నం రిజర్వాయర్ గేటును మరొక మూడు అంగుళాలు ఎత్తి 540 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో నీటిపారుదలశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

ఏఐ స్పీచ్ ప్రాసెసింగ్‌పై శిక్షణ

అగనంపూడి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఏఐ ఆధారిత స్పీచ్ ప్రాసెసింగ్ అప్లికేషన్లపై మంగళవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.మురుగన్, ట్రిపుల్ ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ కుమార్ పుప్పాల ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్పీచ్ ప్రాసెసింగ్ భవిష్యత్తులో మానవ, యంత్ర సంబంధాలను మరింత సహజంగా మార్చబోతుందన్నారు. హెల్త్ కేర్, ఎడ్యుకేషన్, స్మార్ట్ డివైసెస్ వంటి రంగాల్లో ఏఐ స్పీచ్ ప్రాసెసింగ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ జె.సుధాకర్ మాట్లాడుతూ అధ్యాపకుల్లో పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అతిథులను విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై వైసీపీ దుష్ప్రచారం

గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు

పెందుర్తి సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో యూరియా కొరత లేదని, వైసీపీ దుష్ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ యూరియా కొరత అన్నది అసత్య ప్రచారమని, రైతులను భయాందోళనకు గురి చేసి రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో ఇటువంటి దగాకు వైసీపీ తెరతీసిందన్నారు. వ్యవసాయ అవసరాలకు మించి యూరియాను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. యూరియా పంపిణీపై సీఎం చంద్రబాబు నిరంతరం సమీక్షిస్తున్నారన్నారు.

హెల్మెట్ ధరించని ఉక్కు ఉద్యోగులకు నోటీసులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో వాహనాలు వేగంగా నడిపినా, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే ఉద్యోగులపై యాజమాన్యం చర్యలు తీసుకుంటుంది. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల వాహనాల స్పీడ్‌ను హోంగార్డు సిబ్బంది మిషన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో వాహనదారులు వాహనాలను నెమ్మదిగా నడుపుతున్నారు. భద్రత విషయంలో రాజీ పడబోమని, ఉద్యోగులు, కార్మికులు కర్మాగారంలో వాహనాలను నెమ్మదిగా నడపాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా మంగళవారం సుమారు వందమంది ఉద్యోగులకు నోటీసులు ఇచ్చినట్టు సమాచారం.

22 నుంచి టౌన్‌షిప్‌లో బతుకమ్మ సంబరాలు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో బతుకమ్మ సంబరాలను నిర్వహించనున్నట్టు ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. టౌన్‌షిప్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 22 నుంచి 30వ తేదీ వరకు సంబరాలు జరుపుతామని, ఏటా మాదిరిగానే ఈసారి కూడా వైభవంగా చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మ వేడుకలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కుమారస్వామి, జి.ఆనంద్, ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, మల్లేశం, ప్రభాకర్, చంద్రకిరణ్ పాల్గొన్నారు.

సీపీఎం బహిరంగ సభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

మల్కాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ఈ నెల 11న పాతగాజువాకలో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం 59వ వార్డు నెహ్రూనగర్‌లో సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ స్టీల్ ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు గాను ప్రజలందరూ ఒక దండుగా బహిరంగ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సభకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బూడి శ్రీను, కె.రమణ, డి.రాజేశ్, వై.గంగాధర్, సుభానీ, సురేశ్, ఈశ్వరరావు, హేమంత్, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన ప్రదర్శన

పెందుర్తి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, వాహనమిత్ర పథకం కింద రూ.15 వేలు చెల్లించాలని, తదితర డిమాండ్లతో ఈ నెల 11న ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో కలక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పెందుర్తి కూడలిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు, ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ ఇప్పటికే ట్రాఫిక్ నిబంధనలు, జరిమానాలు, చలానాలను కఠినతరం చేయడంతో ఆటో డ్రైవర్లు నైరాశ్యంలో ఉన్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బోరా పైడిరాజు, మురళి, సీహెచ్ వేణు, బి.నాగదేవుడు, పి.అప్పలస్వామి, ఎన్.సాధు, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు 10 మంది విద్యార్థుల ఎంపిక

గోపాలపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న పదిమంది విద్యార్థులు జేసీఐ సంస్థ అందిస్తున్న స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు. పాఠశాలలో టెన్ ప్లస్ చదువుతున్న ఆరుగురు ఇంటర్మీడియట్ విద్యార్థులు, పదో తరగతి చదువుతున్న నలుగురు స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు హెచ్ఎం వై.స్వర్ణలత తెలిపారు.

ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు ఈ నెల జీతాలను చెల్లించాలని కోరుతూ అధికారులకు తెలుగునాడు స్టీల్ వర్కర్స్ యూనియన్ (టీఎన్‌టీయూసీ) నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గత ఏడాది కాలంగా ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు స్కూళ్లు, కాలేజీల ఫీజులు చెల్లించలేకపోతున్నారని, బ్యాంకులకు ఈఎంఐలు చెల్లించక డిఫాల్టర్లుగా మారుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల పెండింగ్‌లో ఉన్నవాటితో పాటు ఈ నెల జీతాన్ని చెల్లించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి, అధ్యక్షుడు జి.నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

బతికి చూపించు!


ప్రాణాల మీదకు తెస్తున్న క్షణికావేశం

ఛిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు

దేశంలో ఏటా లక్షల మంది బలవన్మరణ యత్నం

- గత ఏడాదితో పోలిస్తే రెండు శాతం పెరిగిన ఆత్మహత్యలు
- యువతలో చదువు, ఒత్తిడి, ప్రేమ వ్యవహారాలే కారణాలు
- మధ్య వయసు వారిలో వివాహేతర సంబంధాలు, అనుమానాలు, ఆర్థిక అంశాలు
- వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు, ఒంటరితనం
- ప్రతి నాలుగింటిలో మూడు నిలువరించే అవకాశం

నేడు ఆత్మహత్యల నివారణ దినం



విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

మార్కులు తగ్గాయని.. ఆర్థిక ఇబ్బందులున్నాయని, పంట చేతికి రాలేదని, భర్త అనుమానించాడని, ర్యాంకులు రాలేదని, వ్యాపారంలో నష్టాలు వచ్చాయని, ఉద్యోగపరమైన ఒత్తిడి పెరిగిందని.. ఇలా కారణాలు ఏవైనా దేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గత పదేళ్లలో 35 శాతం మేర ఆత్మహత్యలు పెరిగినట్టు నిపుణులు చెబుతున్నారు. గత ఏడాది ప్రతి లక్ష మందిలో పది నుంచి 11 మంది ఆత్మహత్యకు యత్నించినట్టు తేలింది. ఈ ఏడాది మరో రెండు శాతం పెరిగినట్టు చెబుతున్నారు. యువత బలవన్మరణాలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. నేడు అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలను నివారించే ఉద్దేశంతో 2003 నుంచి ఆత్మహత్యల నివారణ దినాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రివెన్షన్ (ఐఏఎస్‌పీ) భిన్న కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. ఈ ఏడాది ఛేంజింగ్ ద నెరేటివ్ ఆఫ్ సూసైడ్ థీమ్‌తో నిర్వహిస్తున్నారు. అంటే, ఆత్మహత్యలను చూసే దృక్పథంలో మార్పు రావాలని ఉద్దేశం.

దేశంలో ఏటా 1.8 లక్షల మంది..

దేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఏటా ప్రపంచవ్యాప్తంగా 7.2 లక్షల మంది ఆత్మహత్య చేసుకుంటుండగా, దేశంలో 1.8 లక్షల మంది మృతి చెందుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మరో 25 లక్షల మంది ఆత్మహత్య ప్రయత్నం చేసినట్టు చెబుతున్నారు. వారిలో ప్రతి 20 మందిలో ఒకరు మృతి చెందుతున్నట్టు తేలింది.

ఇవీ కారణాలు..

ఆత్మహత్యలకు అనేక అంశాలు కారణం. ఇందులో ప్రధానమైనది డిప్రెషన్. ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ పరమైన ఒత్తిడి, ప్రేమ వైఫల్యం, కుటుంబ తగాదాలు. డిప్రెషన్‌తో బాధపడే వ్యక్తుల తరువాత ఆలోచన ఆత్మహత్య. ఈ దశలో గుర్తించడం కీలకం. కౌన్సెలింగ్, యాంటీ డిప్రెషన్ థెరపీ, సైకో థెరపీతో సాధారణ స్థితికి తీసుకురావచ్చు. ప్రతివంద ఆత్మహత్యల్లో 30 మంది 10 నుంచి 30 ఏళ్లలోపు వారుంటే, 30 నుంచి 50 ఏళ్లలోపు వారు 50 మంది, 50 నుంచి 70 మధ్య 15 శాతం, 70 ఏళ్లు పైబడిన వారిలో మరో ఐదు శాతం మంది ఉన్నారు.

అప్రమత్తం కావాలి..

ఆత్మహత్య ఆలోచనలున్న వ్యక్తుల్లో కొన్ని లక్షణాలుంటాయి. వాటిని గుర్తిస్తే అడ్డుకోవచ్చు జీవితం పట్ల హోప్ లేకుండా మాట్లాడడం, నిరాశ, నిస్పృహ, ఒంటరిగా ఉండడం, నిద్ర రాకపోవడం, ఎవరి తోనూ కలవకపోవడం, వీరిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పిస్తే జీవితంపై భరోసా కల్పించవచ్చు.

క్షణికావేశంలోనే అధికం..

ఇటీవల క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నవారి సంఖ్య పెరుగుతోంది. తండ్రి కొట్టాడనో, భర్త తిట్టాడనో క్షణాల్లోనే నిర్ణయం తీసుకుని తనువు చాలిస్తున్నారు. వీరిని ముందుగా గుర్తించడం చాలా కష్టం. వీటిని ఎమోషనల్ సూసైడ్స్ అంటారు. షార్ట్ టెంపర్ ఉన్న వ్యక్తుల్లో ఈ ప్రమాదం అధికం.

బతికి చూపించాలి..

కష్టాలు, నష్టాలు లేని వ్యక్తులు ఉండరు. విజయ శిఖరాలను అధిరోహించి ఉన్నతస్థానాల్లో ఉన్న ఎంతోమంది ఒకప్పుడు జీవితంలో కిందపడి లేచినవారేనని గుర్తించాలి. కష్టాలకు తలొగ్గి ప్రాణాలను తీసుకుంటే పిరికి చర్యగా సమాజం చూస్తుంది. అదే నిలబడి విజయం సాధిస్తే సమాజం గొప్ప వ్యక్తిగా కీర్తిస్తుంది. ఈ విషయాన్ని గుర్తిస్తే ఆత్మహత్య ఆలోచన రాదని నిపుణులు చెబుతున్నారు.

పోరాడేతత్వం లేకనే...



కష్ట, నష్టాలను ఓర్చుకుని, పోరాడేతత్వం లేక ఆత్మహత్య ఆలోచనలు పెరుగుతున్నాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగడవడమూ కారణమే. ఈ తరహా ఆలోచనలున్న వారిని ముందుగా గుర్తించే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా చర్యలు లేకపోవడంతో బలవన్మరణాలు పెరుగుతున్నాయి. మెదడు ఫంక్షనింగ్‌లో మార్పులు, ఆత్మహత్యలను ప్రేరేపించే పరిసరాలు, వ్యక్తిగత ఇబ్బందులు కారణమవుతున్నాయి. మెదడులోని హెబున్యుల్ అనే సెన్సార్ డిసప్పాయింట్‌మెంట్, ఫెయిల్యూర్స్‌లో నెగిటివ్ థాట్స్‌ను యాక్టివ్ చేసి ఆత్మహత్యకు పురిగొల్పుతుంది.

\- డాక్టర్ ఎన్ఎన్ రాజు, మానసిక వైద్య నిపుణులు

అనేక కారణాలు



గతంతో పోలిస్తే విద్యార్థుల్లో ఆత్మహత్య ఆలోచనలు పెరుగుతున్నాయి. ఏటా 13 వేలమంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. 15 నుంచి 29 ఏళ్లలోపు వయసు వారిలో ఆత్మహత్యలు ఎక్కువ. వీటి కారణాలను గుర్తిస్తే నివారించే అవకాశం ఉంది. వర్సిటీల్లో స్టడీని పూర్తి చేసిన తరువాత కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించాలని భావిస్తున్నాం. పబ్లికేషన్స్ చేయిస్తాం. ఈ తరహా లక్షణాలున్న వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పిస్తే మేలు జరుగుతుంది. ఇందుకోసం వర్క్‌షాప్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

\- ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, ఏయూ సైకాలజీ విభాగాధిపతి

విద్యార్థుల్లో ఆత్మహత్యలకు తొమ్మిది కారణాలు

- పరిశోధన చేసిన ఏయూ సైకాలజీ విభాగం

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో విద్యార్థులు ఎక్కువ. ఇలాంటి ఆలోచనలకు కారణమవుతున్న అంశాలు తెలుసుకునేందుకు ఏయూ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయాల్లో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులపై విభాగాధిపతి ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు ఆధ్వర్యంలో 35 మంది సైకాలజీ విద్యార్థులు పరిశోధన చేశారు. సుమారు ఆరువేల మంది నుంచి సేకరించిన నమూనాలను పరిశీలించి తుది నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఇప్పటివరకు 1,200మంది ఇంజనీరింగ్, ఫార్మసీ, లా, ఆర్ట్స్ కోర్సులు చేస్తున్న వారి నుంచిసమాచారాన్ని సేకరించి అధ్యయనం చేశారు.

తొమ్మిది ఫ్యాక్టర్స్ గుర్తింపు..

విద్యార్థుల్లో ఆత్మహత్య ఆలోచనలకు తొమ్మిది ఫ్యాక్టర్స్ ఉన్నట్టు స్టడీలో గుర్తించారు. వీటిలో ఇండివిద్యువల్ (ఆర్థిక ఇబ్బందులు, చదలేకపోతున్నానని, అందంగా లేనని, లాంగ్వేజ్ ఇబ్బందులు), హోమ్ రిలేటెడ్ ఇష్యూస్ (కుటుంబపరమైన), క్లాస్ రూమ్ స్ట్రెస్ (అకడమిక్ స్ట్రెస్, అంచనాలు అందుకోలేకపోవడం, సబ్జెక్టులు ఫెయిల్ కావడం), సెక్సువల్ ఫీలింగ్ (యుక్త వయస్కుల్లో ఉన్నప్పుడు అపోజిట్ సెక్స్‌పై ఆసక్తి పెరగడం, ప్రేమ, కాదంటారన్న భయం), ఫెయిల్యూర్ పట్ల భయం (భవిష్యత్తుపై ఆందోళన, మార్కులు, సబ్జెక్టులపై భయం), ఆత్మన్యూనతా భావం (అందంగా లేనని, పొట్టిగా ఉన్నానని, బాడీ పార్టులు పట్ల ఇబ్బంది), యాంగ్జైటీ (నిద్ర పట్టకపోడం, అరవడం, చీకటి ప్రదేశాలకు వెళ్లేందుకు భయపడడం, తీవ్రఒత్తిడి, సూసైడ్ థాట్స్ లక్షణాలు 38.2 శాతం మందిలో గుర్తించారు. 460 మంది వీటిలో ఏదో ఒక ఆలోచనతో ఉన్నారన్నారు. ఏడు నుంచి ఎనిమిది శాతం మంది ఆత్మహత్య ఆలోచనల వరకు వస్తున్నట్టు గుర్తించారు.

మహిళలపై అఘాయిత్యాలను సహించం

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి
- దీన దయాళపురంలో బాలల ప్రత్యేక వసతిగృహం ప్రారంభం



బాలురు అదనపు గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి, చిత్రంలో ఎమ్మెల్యే వెలగపూడి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్

ఆరిలోవ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలను సహించబోమని, దోషులు ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తీసుకుని, శిక్ష పడేలా చూస్తామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. చినగదిలి మండలం దీన దయాళపురంలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన బాలల ప్రత్యేక వసతిగృహాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌తో కిలిసి మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె సీతమ్మధారలో జరిగిన ఘటనపై స్పందించారు. ఇలాంటి ఘటనలను ఖండిస్తున్నామని, నిందితులకు శిక్ష పడేలా చూస్తామన్నారు. పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, ఇలాంటి ఘటనలపై పౌర సమాజం పోలీసుల్లా స్పందించాలన్నారు. సమాజంలో మార్పు వస్తేనే ఆడపిల్లలపై అఘాయిత్యాలు ఆగుతాయన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, ఇందులో భాగంగా గంజాయిని అరికట్టామన్నారు. అనుకోని సంఘటనలతో బాలల గృహానికి వచ్చిన చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పించి, మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ భవనం అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కెల్ల సునీత, మద్దిల రామలక్ష్మి, ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయదేవి, బాలుర ప్రత్యేక గృహం, పరిశీలన గృహం, సూపరింటెండెంట్లు అన్నాజీరావు, షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త ఆలోచనలతో వస్తే పరిశ్రమలు పెట్టిస్తాం

- 2030 నాటికి 50 మిలియన్ ఉద్యోగాలు లక్ష్యం
- గేమ్ సహ వ్యవస్థాపకులు మదన్



సమావేశంలో మాట్లాడుతున్న గేమ్ సహ వ్యవస్థాపకులు మదన్. పక్కన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ రవి ఈశ్వరపు, ప్రతినిధులు.

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా మంచి ఐడియాతో వస్తే.. వారితో పరిశ్రమను పెట్టిస్తామని, దేశంలో యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని గ్లోబల్ అలయెన్స్ ఫర్ మాస్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్(గేమ్) పని చేస్తున్నదని సహ వ్యవస్థాపకులు పి.మదన్ వెల్లడించారు. సిరిపురంలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఈఓ రవి ఈశ్వరపు, ఇతర పారిశ్రామికవేత్తలతో కలిసి మాట్లాడారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో యువత, మహిళలను సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలుగా మార్చడానికి గేమ్ వేదికగా పనిచేస్తుందన్నారు. సరైన ఆలోచన, స్థానిక సహకారం, ప్రభుత్వ విధానాలు దీనికి దోహదపడతాయన్నారు. ఇప్పటికే నాగాల్యాండ్, నాగ్‌పూర్‌లో గేమ్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అండగా నిలుస్తోందన్నారు. 20230 నాటికి 50 మిలియన్ల మందికి ఉపాధి చూపించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాష్ట్రంలో మొదట విశాఖలోనే డిస్ట్రిక్ట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మిషన్ ప్రారంభించామన్నారు. హబ్ సీఈఓ రవి ఈశ్వరపు మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. హబ్, గేమ్ కలసి స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలకు అన్ని రకాల సహకారం అందిస్తాయన్నారు. దివాళాలో ఉన్న పరిశ్రమలను తిరిగి లాభాల్లోకి తెచ్చేలా సహకరిస్తామన్నారు. విశాఖలో దీనిని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకున్నామన్నారు. సీఐఐ మహిళా పారిశ్రామికవేత్తల ప్రతినిధి యార్లగడ్డ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ ఎవరైనా కొత్త ఆలోచనతో వస్తే పరిశ్రమతో పాటు బ్రాండింగ్ చేసి పెడతామన్నారు. స్టార్టప్‌లకు చేయూతనివ్వడమే గేమ్ ధ్యేయమన్నారు. సమావేశంలో అరకు కాఫీ అధినేత రామ్‌కుమార్ వర్మ, గేమ్ ప్రతినిధి కేతుల్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏపీటీఎఫ్ పోరుబాట



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరుణాకరరావు తదితరులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేసి, సీపీఎస్ రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కరుణాకరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వం అవలంబిస్తున్నవిధానాలను నిరసిస్తూ మంగళవారం ఏపీటీఎఫ్ విశాఖ జిల్లా ఆధ్వర్యంలో పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11 నుంచి 17 వరకు నిరసన వారం చేపడతామన్నారు. 12వ పీఆర్‌సీ వేసి, ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల ఆర్థిక బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

రైతుల పక్షాన పోరాడుతాం

- వైసీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



భీమిలిలో ర్యాలీ చేస్తున్న వైసీపీ నేతలు

భీమునిపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. అధిష్ఠానం పిలుపుతో మంగళవారం భీమిలిలో అన్నదాత పోరు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు సమన్వయం లేదని విమర్శించారు. ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయికి వెళ్లరని, మీడియా ముందు మాట్లాడుతారన్నారు.ఎన్ని ఆటంకాలు ఎదురైనా వైసీపీ రైతుల పక్షాన నిలుస్తుదన్నారు. రైతు సంక్షేమానికి గత ప్రభుత్వం అమలుచేసిన బీమా, సబ్సిడీ ఎత్తివేశారన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందన్నారు. ర్యాలీలో వైసీపీ నేతలే అధికంగా కనిపించారు. రైతుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. నార్త్ ఏసీపీ ఆదేశాలతో భీమిలి, ఆనందపురం, పద్మనాభం సీఐలు తిరుమలరావు, వాసునాయుడు, శ్రీధర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మహిళా అధ్యక్షురాలు పి.రమణికుమారి, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, నేతలు దౌలపల్లి ఏడుకొండలరావు, అల్లిపిల్లి నరసింగరావు, బోని బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

భవనం పైనుంచి దూకి వివాహిత ఆత్మహత్య



ప్రత్యూష(ఫైల్ ఫొటో)

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మానసిక అనారోగ్య కారణాలతో భవనం పైనుంచి దూకి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 87వ వార్డు పరిధి వడ్లపూడికి చెందిన విశ్రాంత ఉక్కు ఉద్యోగి పాకలపాటి సత్యనారాయణరాజు కుమార్తె పిన్నమరాజు ప్రత్యూష (38)కు 15 ఏళ్ల క్రితం అనకాపల్లి జిల్లా రాంబిల్లికి చెందిన పిన్నమరాజు సతీశ్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడున్నాడు. 3 నెలల క్రితం అతడి చదువుకోసం కూర్మన్నపాలెంలోని అశోక్‌నగర్‌లో ఓ ఫ్లాటును అద్దెకు తీసుకున్నారు. తొమ్మిదేళ్లుగా ప్రత్యూష మానసిక వ్యాధి, నిద్రలేమితో బాధపడుతూ మందులు వాడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దువ్వాడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడిచేసి.. కారుతో పరారీ

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అద్దెకు తీసుకున్న కారులో ఉన్న వ్యక్తిపై ఆరుగురు వ్యక్తులు దాడి చేసి, అతడి వస్తువులు,కారుతో సహా పరారైన సంఘటన ఎంవీపీ స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితుడు అనారోగ్యం కారణంగా ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో పోలీసులు తాజాగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ దేముడు నాయుడు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ పాయకాపురం సుందరయ్యనగర్‌కి చెందిన చల్లా కృష్ణంరాజు దేవరాపల్లి సమీపంలో రియల్ ఎస్టేట్, క్వారీ మైనింగ్ వ్యాపారం చేస్తున్నారు. ఈ నెల 3న విశాఖ వచ్చిన ఆయన ఏపీ 40 హెచ్ఎన్ 6660 నంబరు గల బ్రిజా కారును అద్దెకు బుక్ చేసుకుని, భీమిలి, రుషికొండ వెళ్లి, రాత్రి 10.30 గంటల సమయంలో అప్పుఘర్ వద్దకు చేరేసరికి డ్రైవర్ సిరిగుడి రాజు కారును నిలిపి, పబ్లిక్ టాయిలెట్‌లోకి వెళ్లాడు. అదే సమయంలో ఆరుగురు వ్యక్తులు కారు వద్దకు వచ్చి కృష్ణంరాజుపై దాడి చేసి, అతడి ఐ ఫోన్, విలువైన పత్రాలు, ఇతర వస్తువులు, కారుతో సహా పరారయ్యారు. బాధితుడు తన బంధువు ఆదిత్య సహాయంతో తొలుత కేజీహెచ్, అనంతరం ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. అయితే దాడికి పాల్పడింది కారు డ్రైవర్ సిరిగుడి రాజుకు సంబంధించిన మధువంశీ, రామకృష్ణ, మధు బుజ్జి, మధు చైతన్య, మరో ముగ్గురున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ ఆర్ఎం

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, ఇతర సమస్యలపై రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు బుధవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు 99592 25580కు ఫోన్ చేసి ఆర్టీసీలో ఎదురవుతున్న సమస్యలు, సూచనలు తెలియజేయవచ్చునన్నారు.

అందరినీ అలరించేలా కిష్కింధపురి చిత్రం

- హీరో బెల్లంకొండ శ్రీనివాస్, దర్శకుడు కౌశిక్



మాట్లాడుతున్న హీరో, దర్శకుడు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రేక్షకులందరినీ అలరించేలా కిష్కింధపురి చిత్రాన్ని తెరకెక్కించామని చిత్రం కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్, దర్శకుడు కౌశిక్ పెగల్లాటి అన్నారు. ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో కిష్కింధపురి చిత్రం ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సినిమాలో ట్విస్టులు, షాక్ ఫ్యాక్టర్స్ అద్భుతంగా ఉంటాయన్నారు. మిరాయ్ సినిమాతో తమ చిత్రానికి పోటీలేదని, తామే ముందు రిలీజ్ డేట్ ఇచ్చామన్నారు. విశాఖపట్నం అభివృద్ధి చెందిన కూల్ సిటీ అన్నారు. సినిమాలో హర్రర్ ఎలిమెంట్స్ అద్భుతంగా చిత్రీకరించామన్నారు. హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ నటన అద్భుతంగా ఉంటుందన్నారు.

నక్కపల్లిలో స్టీల్ పరిశ్రమ రాష్ట్రానికి గర్వకారణం

- కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ (ఏఎంఎన్ఎస్) భారీ ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మంగళవారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో ఏఎంఎన్ఎస్ ఇండియా సీఈఓ దిలీప్ ఊమెన్‌తో పాటు ఇతర ప్రతినిధులు మంత్రి శ్రీనివాస్ వర్మతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వివరాలను కంపెనీ ప్రతినిధులు వివరించారు. నక్కపల్లి ఏపీఐఐసీ పారిశ్రామిక ప్రాంతంలో ఈ స్టీల్ ప్లాంట్‌ను రెండు దశల్లో నిర్మిస్తున్నారు. మొత్తం 17.8 మిలియన్ టన్నుల వార్షిక ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. మొదటి దశలో 7.3 మిలియన్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని పూర్తి చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఏఎంఎన్ఎస్ రూ. 1,35,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. దీనివల్ల 55వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. మొదటి దశ 2029, రెండో దశ ఉత్పత్తి 2033 నాటికి ప్రారంభమవుతుందని వివరించారు. ప్రాజెక్టు పనులను త్వరితగతిన ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి శ్రీనివాస వర్మ ఏఎంఎన్ఎస్ ప్రతినిధులకు సూచించారు.